# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త




## సర్వభూపాల వాహనంపై దేవదేవుడు



తిరుమల, అక్టోబర్ 7ప్రభాతవార్తప్రతినిధి: సప్తశైలవాసుడు...శ్రీవేంకటేశ్వరుడు సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో సోమవారం రాత్రి ఉభయదేవేరులతో కలసి సర్వభూపాల వాహనంపై ఊరేగాడు. దేవదేవుడైన శ్రీనివాసుడు రాజాధిరాజు కావడంలో ఆశ్చర్యంలేదు. భూపాలుడు అంటే రాజుఅని, సర్వ భూపాలుడు అంటే అందరురాజులు అని అర్ధం. విష్ణత్వంలేనివాడు రాజు కాలేదు. రాజులందరూ భగవంధంశం కలవారే. తూర్పుదిక్కుకు ఇంద్రుడు, ఆగ్నేయానికి అగ్ని, దక్షిణాదికి యముడు, నైరుతికి నిర్రృతి, పశ్చిమానికి వరుణుడు, వాయువ్యానికి వాయువు, ఉత్తరానికి కుబేరుడు, ఈశాన్యానికి పరమేశ్వరుడు, అష్టదిక్పాలుకులై విరాజిల్లుతున్నారు.

## క్వారీవద్ద పేలుడు: ఇద్దరికి తీవ్ర గాయాలు



పుంగనూరు, అక్టోబరు 7 ప్రభాతవార్త : మండలంలోని మేకనజామనపల్లి వద్ద క్వారీలో సోమవారం మధ్యాహ్నం హఠాత్తుగా పేలుడు సంభవించడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. మేకనజామనపల్లి, మేలుందొడ్డి గ్రామాల మధ్యన క్వారీ ఆఫీసు గది కోసం సిమెంటు ఇటుకలతో నిర్మాణం చేశారు.గదికి రేకులతలుపులు బిగించడానికి వెల్టింగ్ చేసు _ండగా ప్రమాదం సంభవించంది.బండలు చీల్చేందుకు ఉపయోగించే ప్రేలుడు మందు గదిలో ఉండగా,వెల్డింగ్ రవ్వల ధాటికి ఒక్కసారిగా పేలుడు సంభవించింది. పట్టణానికి చెందిన వెల్డింగ్ చేసే ఇక్బాల్,ఆసిఫ్ అనే అన్నదమ్ములు ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వీరిని అత్యవసర చికిత్స నిమిత్తం తిరుపతి కి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తుచేస్తున్నారు.

## వేణుగోపాలునిగా మలయప్ప





తిరుమల, అక్టోబర్ 7ప్రభాతవార్తప్రతినిధి: చేతిలో పిల్లనగ్రోవి ధరించి వేణుగోపాలస్వామి అలంకారంలో కలియుగవైకుంఠవాసుడు ఉభయదేవేరులతో కలసి కల్పవృక్షవాహనంపై భక్తులకు దర్శనమిచ్చాడు. క్షీరసాగర మథనంలో విలువైన వస్తువులెన్నో ఉద్భవించాయి. వాటిలో కల్పవృక్షం ఒకటి. ఈ చెట్టునీడన చేరినవారికి ఆకలిదప్పులుండవు. పూర్వజన్మస్మరణ కూడా కలుగుతుంది. ఇతర వృక్షాలు తాము కాచిన ఫలాలు మాత్రమే ప్రసాదిస్తాయి. కల్పవృక్షం వాంఛిత ఫలాలన్నిటినీ ప్రసా దిస్తుంది. అటువంటి కల్పవృక్ష వాహనాన్ని అధిరోహించి తిరుమాఢవీధుల్లో కలియుగప్రత్యక్షదైవం విహరించి భక్తులను కటాక్షించాడు. వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఈఓ శ్యామలరావు దంపతులు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, జెఈఓలు పాల్గొన్నారు.

## టిడిపి ప్రభుత్వంలో
# ఆడపిల్లలకు రక్షణ లేదు
### ఆస్పియా హంతకులను కఠినంగా శిక్షించాలి
### వైసిపి అధికార ప్రతినిధి ఆర్.కె.రోజా



పుత్తూరు, అక్టోబరు 7 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ పాలనలో ఆడపిల్లలకు రక్షణ లేకుండా పోతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మంత్రి ఆర్.కె.రోజా ఆరోపించారు. ముఖ్యమంత్రి సొంత చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గంలో ఏడేళ్ల పాప ఆస్పియాను కిడ్నాప్ చేసి కిరాతంగా హత్య చేసిన దుస్సంఘటన గుండెను పిండేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సిఎం సొంత జిల్లాలోనే ఆడపిల్లలకు రక్షణ లేకపోవడం ప్రభుత్వ అసమర్ధత కాదా అని ప్రశ్నించారు. తల్లితండ్రులు తమ ఆడపిల్లలను స్కూళ్లకు పంపించాలంటే కూడా ఆలోచించే దారుణ పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత నెల 29వ తేదీన పాప అదృశ్యమై సమీప ప్రాంతాల్లోనే వారం రోజుల పాటు వున్నప్పటికీ పోలీసులు గుర్తించలేకపోయారన్నారు. వారం తర్వాత బాలిక మృతదేహమై కనిపించిందంటే రాష్ట్రంలో ప్రభుత్వం, పోలీసులు వున్నారా...లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్నూలు జిల్లా ముచ్చుమర్రి గ్రామంలో రేప్ చేసి, హత్య చేసిన సంఘటనలో కూడా బాధితులకు న్యాయం జరగలేదన్నారు. రాష్ట్ర మంత్రి లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గంలో ముగ్గురు మహిళలపై అత్యాచారం జరిగిందంటే ప్రభుత్వ పనితీరు ఎంత ఘోరంగా వుందో అర్ధమవుతోందన్నారు. హోమ్ మంత్రి అనిత పొరుగు నియోజకవర్గం రాంబిల్లి మండలంలో ఒక యువతి కాపాడమని కోరినా పట్టించుకోకపోవడంతో జైలు నుంచి వచ్చిన నిందితుడు ఆ యువతిని చంపేశాడని తెలిపారు. రెడ్‌బుక్ అంటూ లోకేష్, శాంతిభద్రతలు మీరితే మక్కెలిరగ్గొడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రగల్భాలు పలకడం మానేసి ముందుగా రాష్ట్రంలో మహిళలకు, ఆడపిల్లలకు రక్షణ కల్పించడంపై దృష్టి పెట్టాలని హితవు పలికారు.

## నేడే గోవిందునికి గరుడసేవ



తిరుమల,అక్టోబర్ 7ప్రభాతవార్తప్రతినిధి: బ్రహ్మోత్సవాల వాహనసేవల్లో ఐదవరోజు గరుడసేవకు ఎంతో ప్రాధాన్యత ఉంది. స్థానికులేగాక తమిళనాడు, కర్నాటక, తెలుగు రాష్ట్రాల నుండి భక్తులు అశేషంగా తరలివస్తారు. మాఢవీధుల్లోని గ్యాలరీల్లో ఉన్న 2లక్షలమంది భక్తులకు అన్నప్రసాదాలు నిరంతరాయంగా అందిస్తారు. ప్రతిగ్యాలరీలో శ్రీవారి సేవకులు ,పారిశుధ్య సిబ్బంది అన్నప్రసాదం సిబ్బందిని నియమించారు. వైద్యబృందాలు సిద్ధంగా ఉంటున్నాయి. తిరుమలలో ఒక్కోమాఢ వీధికి ఒక సీనియర్ అధికారి, వారికి సహాయకులుగా ఉద్యోగులు, శ్రీవారిసేవకులు ఉం టారు. భక్తుల రద్దీ వున్న ఇతరప్రాంతాల్లో మొత్తం 27పెద్ద డిజిటల్ స్క్రీన్లను ఏర్పాటుచేశారు. 400 ఆర్టీసి బస్సులు 5వేలకుపైగా ట్రిప్పులతో భక్తులకు రవాణా వసతి కల్పిస్తారు. తిరుమలలో 7వేలవాహనాలు మించితే అలిపిరిలో నిలిపివేస్తారు.గరుడసేవను విజయవంతం చేయడానికి టిటిడి ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ వెంకయ్యచౌదరి, జెఈఓలు గౌతమి, వీరబ్రహ్మం, సివిఎస్ఓ శ్రీధర్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, తిరుమల డిఎస్పీ విజయశేఖర్, సిఐ విజయకుమార్ బారీగా ప్రణాళికప్రకారం ఏర్పాట్లుతో సిద్దమయ్యారు.



## బ్రహ్మోత్సవ సారధులు!
### టిటిడిలో అనుభవంలేకున్నా
### అవగాహన,సంయమనంతో పనితీరు

ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల: ఒకరు సీనియర్ ఐఎఎస్ అధికారి....మరొకరు సీనియర్ ఐఆర్ఎస్ అధికారి. ఇద్దరూ ప్రభుత్వ పరిపాలనపై పట్టు కలిగిన అధికారులే అయినా అందుకు భిన్నంగా ధార్మికసంస్థ టిటిడిలో పనితీరు సాగించాల్సి రావడం ఆషామాషీ కాదు. అందునా నిత్యకల్యాణంపచ్చతోరణంగా విరాజిల్లే తిరుమలకొండపై సహజంగానే వేంకటేశ్వర స్వామికి ప్రతిరోజూ సేవలు...పూజలే. ఏదైనా కార్యక్రమంలో 10,20వేలమంది సంఖ్య దాటితేనే వారికి సౌకర్యాలు కల్పన, నియంత్రణ మాటల్లోచెప్పలేరు. అలాంటిది ఒక్కసారిగా రోజుకు లక్షమందినుండి 1.30లక్షలమంది వరకు భక్తులు ఒకచోట చేరితే పరిస్థితిని అంచనావేయలేం.ఏడాదిలో తొమ్మిదిరోజులు పాటు జరిగే శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా, చిన్నపాటి అవాంతరాలు లేకుండా, భక్తుల సౌకర్యాలపై దృష్టి సారించి జరిపించడమంటే మాటలు కాదు. ఆ ఇద్దరే... ఒకరు టిటిడి ఈఓ జె.శ్యామలరావు, మరొకరు అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి. గతంలో టిటిడిలో పనిచేసిన ఎందరో ఈఓ,జెఈఓలు సుదీర్ఘకాలం పాటు ఇలాంటి దేవుని ఉత్సవాలు జరిపించిన అనుభవం ఉంటేనే చిన్నచిన్నలోపాలు ఎదురయ్యేది. అయితే ప్రస్తుతం ఈ ఇద్దరు టిటిడిలో బాధ్యతలు చేపట్టి కూడా తక్కువ సమయమే అయినా ఉన్న అవగాహనతో క్రిందిస్థాయిలో జెఈఓలు, డిప్యూటీ ఈఓలు, సూపరిండెంట్లు కొందరు అనుభవజ్ఞులైన సీనియర్ ఉద్యోగులు, ఇంజనీరింగ్ అధికారులతో కలసి హోదాతేడా లేకుండా ఆత్మీయతతో సూచనలు, సలహాలు తీసుకుంటూ ఏర్పాట్లు చేయడమే వారి తొలి అడుగుకు విజయంగా మారింది. కొంతవరకు ఇద్దరు సారధులకు బ్రహ్మోత్సవాల నిర్వహణపై అవగాహన లేకపో యినా.... ఉన్నంతలో భక్తులసేవలో తరించడం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డైరెక్షన్ మేరకు పనిచేయడం వారికి అదనపు అనుభవంగా కలిసొచ్చిందని చెప్పవచ్చు. ఆ ఇద్దరిలో ఉన్న సంయమనం, భక్తులకు సౌకర్యాలు కల్పించాలనే తపన స్పష్టంగా కనిపిస్తోంది.

## లలితా త్రిపుర సుందరి దేవి అలంకరణలో శ్రీతాతయ్యగుంట గంగమ్మ



తిరుపతి హెల్త్, అక్టోబర్ 7, ప్రభాతవార్త శ్రీ దేవి శరన్నవరాత్రి సందర్భంగా ఆలయంలో సోమ వారం లలితా త్రిపుర సుందరి దేవి అలంకరణలో శ్రీ తాతయ్యగుంట గంగమ్మ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం 7 నుంచి 8 గంటల వరకు అమ్మవారి అభిషేకంతో మొదలై 8 గంటలకు అమ్మవారి అభిషేకం, 10 గంటలకు సహస్ర నామ అర్చన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ. జయ కుమార్, ఆలయ అర్చకులు, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 200 అర్జీలు
### అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి : జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్



తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 7, ప్రభాతవార్త ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డిఆర్ఓ పెంచల్ కిషోర్, డిప్యూటీ కలెక్టర్లు నరసింహులు, దేవేంద్ర రెడ్డి, రామ్మోహన్‌లతో కలిసి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. మొత్తం 200 వినతులు రావడం జరిగిందని అధికారులు అందరు అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా నాణ్యతగా, అర్ధవంతంగా పరిష్కరించాలని గ్రీవెన్స్‌కు హాజరైన వివిధ శాఖకు సంబంధించిన అధికారులకు జిల్లా జాయింట్ కలెక్టర్ సూచించారు.



భక్తిప్రపత్తులతో సోమవారం మధ్యాహ్నం తమిళనాడులోని విళ్ళిపుత్తూరు వచ్చిన గోదాదేవి మాలలు

## పిడుగు పడి మహిళ మృతి

వడమాలపేట, అక్టోబరు 7 ప్రభాతవార్త: మండలంలోని సీతారామపురం పంచాయతీ పరిధిలోని మేదరమిట్ట గ్రామంలో పిడుగుపడి నారాయ ణమ్మ(65) అనే మహిళ మృతి చెందింది. మేదరమిట్ట గ్రామంలో నివాసం ఉంటున్న గుట్ట మునస్వామి నాయుడు భార్య నారాయ ణమ్మ సోమవారం ఉదయం 10 గంటలకు మేకలను మేపుకునేం దుకు సమీపం లోని గుట్టకు తోలుకుని పోయింది. కొంతసేపటికి ఉరుములతో కూడిన వర్షం పడడంతో పట్ట నెత్తిన వేసుకుని బండపై నిల్చుంది. అదే సమయంలో నారా యణమ్మ పక్కన పిడుగు పడడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సమా చారం తెలుసుకున్న సీతారామపురం వీఆర్‌వో నాగరాజు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. నారాయణమ్మకు ముగ్గురు కుమారులు ఉన్నారు.

## శ్రీచెంగాళమ్మకు అష్టకాళి అలంకారం



సూళ్లూరుపేట, అక్టోబర్ 7 ప్రభాతవార్త సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాతా పరమేశ్వరి దేవస్థానంలో నిర్వహిస్తున్న శరన్నవ రాత్రుల వేడుకల్లో భాగంగా సోమవారం అమ్మణ్ణి శ్రీ అష్టకాళి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చింది. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మి పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అలంకారానికి హైదరాబాద్‌కు చెందిన మద్దాలి శరణ్‌కుమార్‌రెడ్డి, లక్ష్మీప్రియ దంపతులు ఉభయ కర్తలుగా వ్యవహరించారు. చండీ యాగానికి సూళ్లూరుపేటకు చెందిన మాదరపాక జగన్‌మోహన్, గౌరి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహ రించారు. సూళ్లూరుపేటకు చెందిన కవిత బృందంచే భరతనాట్యం నృత్య ప్రదర్శనఏర్పాటుచేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

## పక్కాగా ఉచిత ఇసుక విధానం అమలు



చిత్తూరు, అక్టోబర్ 7 ప్రభాతవార్త: జిల్లాలో ఉచిత ఇసుక విధానం పక్కాగా అమలు జరుగుతున్నదని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. ఉచిత ఇసుక విధానం అమలుకు సంబంధించి సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్ ఎస్పీ మణికంఠ చందోలుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తక్కువ ధరకు ఇసుక ప్రజలకు అందించడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలో ప్రస్తుతం 88,530 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో వుందని, ఇందులో 9,382 మెట్రిక్ టన్నుల ఇసుక బిఎన్ఆర్ పేట, 79,148 మెట్రిక్ టన్నుల ఇసుక పాలూరు స్టాక్ యార్డు, దిగువమాసాపల్లి స్టాక్ యార్డులో వుందన్నారు. జిల్లాలో ఇసుక ఉచితమని, ఇందుకు సంబంధించి జిల్లాలో రవాణా శాఖ, భూగర్భ గనుల శాఖ అధికారులతో ఏర్పాటైన కమిటీ స్థిరమైన రవాణా ఛార్జీలతో కలిపి ఇసుకను అందించడానికి చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకు 92 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అమ్మకాలు జరిగాయని, ఇసుక అక్రమ రవాణా కట్టడి చేయడానికి పూర్తి స్థాయిలో చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.




# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## సమస్యల పరిష్కారానికై ఎంపిడిఒకు దేశం నేతల వినతి

రామకుప్పం, అక్టోబర్ 7 ప్రభాతవార్త

మండలంలోని బందార్లపల్లి పంచాయతీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎంపిడిఒ లక్ష్మీకాంత్‌కు తెదేపా నేతలు వినతిపత్రం అందించారు. పంచాయతీలో తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాల సమస్య ఉందన్నారు. నీటి సమస్య అధికంగా నెలకొందని ట్యాంకరుతో సరఫరా చేయాలని కోరారు. దీనిపై ఎంపిడిఒ సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెరుమాళ్, చంద్రశేఖర్‌రెడ్డి, గిరి, మోహన్ పాల్గొన్నారు.

## పాన్ ఇండియా ఐకానిక్ టీచర్ 2024గా మంజునాథ్

రామకుప్పం, అక్టోబర్ 7 ప్రభాతవార్త



రామకుప్పం పట్టణంకు చెందిన బల్దారు రామప్ప, సరోజమ్మల కుమారుడు ప్రైవేట్ గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మంజునాథ్ పాన్ ఇండియా ఐకానిక్ టీచర్ 2024 అవార్డును అందుకున్నారు. రాజమహేంద్రవరంలోని ఆనంద్ రీజెన్సీ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మంజునాథ్ ఈ అవార్డు అందుకున్నారు. దేశవ్యాప్తంగా 1200మంది దరఖాస్తు చేసుకోగా గణిత విభాగంలో మంజునాథ్‌కు అవార్డు రావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## గణనాధుడిని దర్శించుకున్న శాప్ ఛైర్మన్



**కాణిపాకం, అక్టోబర్ 7 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికారిత సంస్థ(శాప్) ఛైర్మన్ అనిమిని రవినాయుడు సోమవారం కాణిపాకం శ్రీ వరసిద్ది వినాయక స్వామిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఎఇఒ రవీంద్రబాబు, అర్చకులు రాజగోపురం వద్ద ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి దర్శనం కల్పించారు. అనంతరం ఆయన స్వామి వారి సేవలో పాల్గొన్నారు. ఆయనకు వేద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట ఆయన సూపరిటెండెంట్‌వాసు, దేవస్థానం మాజీ ఛైర్మన్ మణి నాయుడు, స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## పోలీసు గ్రీవెన్స్‌కు 42 ఫిర్యాదులు



**చిత్తూరు, అక్టోబర్ 7 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ఎస్పీ మణికంఠ చందోలు సోమవారం పాత జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంకు ఈ వారం జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి 42 ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదులను పరిశీలించిన ఎస్పీ మణికంఠ చందోలు సత్వరం పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అత్యధికంగా 10 భూ ఫిర్యాదులు, కుటుంబ తగాదాలు 9, ఆస్తి తగాదాలు 9, వేధింపులు 3, దారి సమస్యలు 2 అందాయి.

## ఎంపిడిఓగా శివరాజన్ బాధ్యతలు స్వీకరణ



**గుడిపాల, అక్టోబర్ 7 ప్రభాతవార్త:** గుడిపాల మండల ఎంపిడిఓగా శివరాజన్ ఎంపిడిఓ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో శివరాజన్ ఇఓఆర్డీగా మండలంలో విధులు నిర్వర్తించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ శివరాజన్ మాట్లాడుతూ గతంలో మండలంలో విధులు నిర్వర్తించిన అనుభవం వుండటంతో ప్రజా ప్రతినిధులు, అధికారులను సమన్వయం చేసుకుని మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఎంపిడిఓగా బాధ్యతలు స్వీకరించిన శివరాజన్‌ను మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుబ్రమణ్యం నాయుడు, ఉపాధ్యక్షులు అనిల్‌కుమార్, మాజీ సర్పంచ్ గోవిందగౌడ్, సీనియర్ నాయకులు సాంబశివనాయుడు తదితరులు ఘనంగా సన్మానించారు.

## రెవెన్యూ సమస్యలు సత్వర పరిష్కారంకు చర్యలు

**గుడిపాల, అక్టోబర్ 7 ప్రభాతవార్త:** రెవెన్యూ సమస్యలను సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని తహసిల్దారు చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం తహసిల్దారు కార్యాలయంలో తహసిల్దారు చంద్రశేఖర్‌రెడ్డి ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో ఎవైనా రెవెన్యూ సమస్యలు వుంటే ప్రజలు సత్వరం తన దృష్టికి తీసకువస్తే వాటిని పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దారు లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు

## మండల ఏఓగా హరిబాబు

**సదుం, అక్టోబరు 7ప్రభాతవార్త** సదుం మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా డీఎస్ హరిబాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీలలోబాగంగా ఆయన మదనపల్లె నుంచి ఇక్కడికి వచ్చి చేరారు. అదేవిధంగా సీనియర్ సహాయకురాలిగా వెంకటరమణమ్మ పదవీ బాధ్యతలు స్వీకరించారు.

## వేలం పాటల ద్వారా రూ. 1.56లక్షల ఆదాయం

**చౌడేపల్లి, అక్టోబర్ 7 ప్రభాతవార్త** స్థానిక కాశీవిశ్వేశ్వరస్వామి మాన్యం భూములకు నిర్వహించిన వేలం పాటద్వారా రూ. 1,56,600లు ఆదాయంగా సమకూరినట్లు పుంగనూరు గ్రూప్ టెంపుల్స్ ఇఓ కమలాకర్ తెలిపారు. స్థానిక గోసలకురపల్లి ఆలయం వద్ద నిర్వహించిన వేలం పాటలో ఆలయ భూములను 3సంవత్సరాల కాలానికి నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలలో ఇంటన్షిప్ తరగతులు



**పాకాల, అక్టోబర్ 8, ప్రభాతవార్త** పాకాల స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు ప్రిసమ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఇంటన్షిన్ శిక్షణా తరగతులలో భాగంగా ఐటీ విభాగంలో 10 రోజుల పాటు దసరా సెలవులలో గ్రామ సచివాలయం, ఫోటోగ్రాఫి విభాగాలలో విద్యార్థిని, విద్యార్థులకు ఇంటన్షిప్ శిక్షణ తరగతులలో భాగంగా భవిష్యత్తులో నేటి బాలలే రేపటి పౌరులు తమ స్వశక్తితో ఎదిగే విధంగా వారి అభివృద్ధి పరచడమే మా లక్ష్యంగా నిత్యం వారి కొరకు పనిచేస్తున్నామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ రఫీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐటి ఒకేషనల్ ట్రైనర్ ఏ. రెడ్డి చైతన్య పాల్గొన్నారు.

## అధికారులు ప్రజా సమస్యలపై సత్వరం స్పందించాలి

– కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్

కుప్పం,అక్టోబర్ 7 ప్రభాతవార్త



అధికార యంత్రాంగం ప్రజా సమస్యలపై సత్వరం స్పందించాలని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక మండల కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)కార్యక్రమంచేపట్టారు. ఈసందర్భంగా నియోజక వర్గంలోని వివిధ మండలాలనుంచి వచ్చిన ప్రజలు పలు సమస్యలపై పి.డి.కు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరగా ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిష్కరించే బాధ్యత అధికారులపై ఉందన్నారు. శాఖలవారీగా అందిన ఫిర్యాదులను ఆయా శాఖలకు పంపుతామని అధికారులు స్పందించి నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమాల్లో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సద్గురు కైవారం తాత విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

కుప్పంరూరల్, అక్టోబర్ 7 ప్రభాతవార్త



కుప్పం పట్టణంలో కాలజ్ఞాన రచయిత శ్రీ సద్గురు యోగి నారేయణ కైవారం తాత విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరుతూ సద్గురు యోగి నారేయణ బలిజ ట్రస్ట్ అధ్యక్షులు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి మంజునాథ్, నేతలు వెంకరమణబాబు, విసి మంజునాథ్, ఉమాపతి, దిలీప్ తదితరులు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్‌కు వినతిపత్రం అందించారు. కుప్పం చెరువు కట్ట వద్ద గుడుపల్లె సర్కిల్ లేదా విజలాపురం సర్కిల్‌లో తగు స్థలాన్ని మంజూరు చేయాలని వారు కోరారు. విగ్రహ స్థాపన, నిర్వహణ బాధ్యతలు ట్రస్ట్ తరపున చేపట్టడం జరుగుతుందని తగు స్థలం కేటాయించాలని వారు కోరారు.

## సిఎం చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం

శాంతిపురం, అక్టోబర్ 7 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడుతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథ నాయుడు, మాజీ వైస్ఎంపిపి ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కోతిగుట్లపల్లి గ్రామంలో 9.70లక్షల రూపాయలతో నూతనంగా సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను భూమిపూజ చేసి వారు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు రోడ్లు వేస్తున్న ఘనత సిఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నేతలు రమేష్‌బాబు, నారాయణ, మునెప్ప, బద్రి, మురళి, గంగారాం, మురుగన్, బాలు, వెంకటేష్ పాల్గొన్నారు

## ఘనంగా సోమవారోత్సవాలు

రామకుప్పం, అక్టోబర్ 7 ప్రభాతవార్త



స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత శ్రీ సుబ్రమణ్యస్వామి ఆలయంలో సోమవారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఆంధ్ర,తమిళనాడు, కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి, శ్రీ శనీశ్వరస్వామి, శ్రీ వినాయక, ఓంశక్తి ఆలయాలు, నక్షత్రవనం భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం జరిపారు. రూరల్ సిఐ మల్లేష్ యాదవ్ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు చేపట్టారు.

## అస్పియా కుటుంబానికి న్యాయం చేయాలి

-రాజంపేట ఎంపి మిథున్‌రెడ్డి



పుంగనూరు, అక్టోబరు 7 ప్రభాతవార్త :

కిడ్నాప్‌నకు గురై హత్యకావించబడ్డ అస్పియా అంజుం కుటుంబానికి న్యాయం జరగాలని ఎంపి మిథున్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాజంపేట ఎంపి మిథున్‌రెడ్డి సోమవారం అస్పియా కుటుంబాన్ని పరామర్శించారు. బాలిక తల్లితండ్రులతో మాట్లాడి వారికి భరోసా ఇచ్చారు. ఈసందర భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్నట్లు తెలిసి దర్యాప్తు వేగం చేసి నిందితులను అదుపులో తీసుకున్నారని,ఇదే ప్రయత్నం తొలిరోజే చేసి ఉంటే బాలికను కాపాడి ఉండవచ్చన్నారు. కేసు పట్ల మంత్రులు,అధికారులు అప్రమత్తమై నిందితులను గుర్తించడంతో పాటూ చర్యలు తీసుకోవడంతో జగన్ పర్యటన రద్దు అయిందన్నారు. అస్పియా సంఘటన దురదృష్టకరమని,కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నేరాలు అధికమయ్యాయన్నారు.

## అర్ధనారీశ్వర రూపంలో శ్రీచౌడేశ్వరీదేవి

పుంగనూరు, అక్టోబరు 7 ప్రభాతవార్త :



మండలంలోని చదళ్ళలో వెలసిన శ్రీసప్తమాతృక సమేత శ్రీచౌడేశ్వరీదేవి నవరాత్రి ఉత్సవాలలో సోమ వారం మూలవిరాట్‌నకు అర్ధనారీశ్వర రూపంలో అ లంకరణ నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఎన్.వేణు గోపాల్‌రెడ్డి, ఉషశ్రీ దంపతుల అధ్వర్యంలో ఈమేరకు హోమపూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్స వాల పాటూ ఆదివారం ఉదయం నుంచి ఎన్వీఆర్ క్రికెట్ కప్‌పోటీలు జోరుగా సాగాయి. సాయంత్రం కోలారు ఆర్కెస్ట్రా బృందం నిర్వహించిన గీతాలాపన కార్యక్రమాలలో పాటల వల్లరి ప్రజలను ఆకట్టు కుంది. అమ్మవారికి సాయంత్రం కుంకుమార్చన,ప్రాకారోత్సవాలను నిర్వహించారు.

## దురాక్రమణదారులపై వేటుకు సిద్ధమవుతున్న అధికారులు

–స్థలాలను పరిశీలించిన ఎసి చిట్టెమ్మ

చౌడేపల్లి, అక్టోబర్ 7 ప్రభాతవార్త



పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో దేవాలయ భూముల దురాక్రమణదారులపై అధికారులు కొరడా ఝుళిపించనున్నారు. ఈమేరకు సోమవారం దేవాదాయధర్మాదాయ జిల్లా అసిస్టెంట్ కమీషనర్ చిట్టెమ్మ దేవాయల భూములను పరిశీలించారు. గోసలకురపల్లి, చౌడేపల్లి తదితర ప్రాంతాల్లో కోట్లాది రూపాయలు విలువ చేయు దేవస్థానం భూములను ఆక్రమించుకొని భవనాలు నిర్మించుకొన్నారని కొందరు ఆమె దృష్టికి తీసుకెళ్ళారు. నూతనంగా వచ్చిన చట్టం ప్రకారం దేవాలయాల భూముల్లో అక్రమంగా చొరబడి కట్టడాలు నిర్మించుకొంటే కేసులు పెడతామని హెచ్చరించారు. ప్రస్తుతం దురాక్రమణలకు పాల్పడిన వారికి నోటీసులు అందిస్తామనీ, ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు చర్యలు తీసుకొంటామని ఒక ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. గోసలకురపల్లిలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం శిథిలావస్థకు చేరుకొందనీ, అయితే ఆలయ మాన్యం భూములు అధికంగా వున్నప్పటికీ ప్రయోజనం లేదన్నారు. పాలకులు, స్థానికులు సహకరిస్తే దేవాలయాలకు పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం చుట్టు వున్న అక్రమ కట్టడాలను తొలగించి దారిని చూపాలని వినాయక యువజన కమిటీ సభ్యులు కడియాల రాజన్న, గణేష్ స్థానికులు ఎసి చిట్టెమ్మను కోరారు. పరిశీలించి చర్యలు తీసుకొంటామనిహామీఇచ్చారు. గ్రూప్‌టెంపుల్స్ ఇఓ కమలాకర్, కుప్పం ఇఓ చలపతి, హరి, స్థానికులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యలపై స్పందించాలి : గువ్వల

చౌడేపల్లి, అక్టోబర్ 7 ప్రభాతవార్త



ప్రజా సమస్యలపై అధికారులు వెంటనే స్పందించాలని మండల తేదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పరిపాలనా భవనంలో అధికారులతో ఆయన మండల అభివృద్ధి, ప్రజా సమస్యలపై సమీక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న వ్యక్తిగత, సామాజిక సమస్యలను తెలుసుకొని పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా రెవిన్యూ, మంచినీరు, పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు. తేదేపా నాయకులు పూల చంద్రమౌళి, కొందూరు శ్రీధర్‌రాజు(గిరి), పంజానిపల్లి బాబునాయుడు, విజయభాస్కర్‌రెడ్డి, రెడ్డెప్ప, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## తెలుగు తమ్ముళ్లు చొరవ.. రోడ్డు పనులు చకచకా

కోట, అక్టోబర్ 7 ప్రభాతవార్త



కోట క్రాస్‌రోడ్డు నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ఆర్ అండ్‌బి రహదారి పరమ అధ్వానంగా ఉండటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం వద్ద నిధులు లేకపోవడంతో రోజురోజుకు ప్రయాణం నరక యాతనగామారింది. తెలుగుదేశం నాయకులు మంచి మనసుతో చొరవ తీసుకొని సోమవారం ఆర్టీసీ బస్టాండు నుంచి గుంతలు పడిన ఆర్‌అండ్‌బి రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టారు. ఆ మేరకు తామే సొంత నిధులతో ఈ రోడ్డు పనులు చేయించేందుకు ముందుకొచ్చామని జిల్లా తెలుగుదేశం పార్టీ మైనారిటీ సెల్ అధ్యక్షులు జలీల్ అహ్మద్, నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. తాత్కాలికంగా రోడ్డులో పడిన గండ్లను పూడ్చడంతో స్థానిక ప్రజలు తెలుగుదేశం పార్టీ నాయకులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కన్వీనర్ మద్దాలి సర్వోత్తమరెడ్డి, ఎంపిటిసిలు దారా సురేష్, షంషుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

## మహాచండీదేవి అలంకారంలో చాముండేశ్వరిదేవి

కోట, అక్టోబర్ 7 ప్రభాతవార్త



కోట మండలం గూడలి గ్రామంలోని రామలింగ చాముండేశ్వరి దేవి ఆలయంలో దసరా ఉత్సవాల్లో భాగంగా 5వ రోజు మహంచండీదేవి అలంకరణలో చాముండేశ్వరిదేవి భక్తులకు దర్శనమిచ్చింది. దేవతల కార్యసిద్ధి దుష్టశిక్షణ శిష్ట రక్షణకు మహాకాళి మహా సరస్వతి త్రిశక్తి స్వరూపిణిగా శ్రీ మహాచండీ అమ్మవారు ఉద్భవించారు. అమ్మవారు దయని ప్రదర్శించేటప్పుడు ఉమా గౌరి పార్వతి, హైమావతి, శాకాంబరి, అన్నపూర్ణ, భవానిగా... కోపం వస్తే దుర్గా, కాళీ, శ్యామచండీ, చండికా, భైరవిగా కనిపిస్తుంది. ఈ తల్లి ఉద్భవం వెనుక పురాణాల్లో ఒక కథ ఉంది. అన్ని ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త ఆశిం శ్రీనివాసులు పర్యవేక్షిస్తున్నారు.

## ఆక్వా ఎక్స్ఛేంజ్ జి అగ్రిటెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు

నాయుడుపేట, అక్టోబర్ 7 ప్రభాతవార్త



విజయవాడలోని సిద్ధార్థ మెడికల్ కాలేజిలో ఆక్వా ఎక్స్ఛేంజ్ అగ్రిటెక్ ప్రైవేట్ లిమిటెడ్ వారు క్రికెట్ పోటీలను సీఈవో కొసరాజు పవన్ కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీలకు గాను మొత్తం 8 టీములు పాల్గొనగా, అందులో స్టార్ పవర్ టీం విజయం సాధించింది. ఈ సందర్భంగా కుదురు సునీల్ మాట్లాడుతూ 8 టీములు తలపడగా ప్రతి మ్యాచ్‌లో ఒకరికి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ఇచ్చినట్లు తెలిపారు. వీరిలో శ్రీనాథ్, నాగరాజు, పవన్, సునీల్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌లు సాధించారు. కుదురు సునీల్ ఆల్ రౌండ్ ప్రతిభ కనబరిచి మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ తీసుకున్నారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ఆల్ రౌండర్‌గా ఎన్నికైన కుదురు మధు మాట్లాడుతూ, ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చెందిన క్రీడాకారులు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ తీసుకోవడం ఎంతో గర్వకారణమన్నారు. తమ ఇన్‌పుట్ హెడ్ తమను బిజినెస్ పరంగా ప్రోత్సహిస్తూ ఉంటారని, కొన్ని సమయాల్లో టార్గెట్లు చేయలేనప్పుడు కొన్ని సలహాలు సూచనలిస్తూ టార్గెట్ రీచయ్యే విధంగా తమను ప్రోత్సహిస్తారని తెలిపారు.

## రైతులకు సబ్సీడి ధరలకు వరి విత్తనాలు: ఎఒ

వెంకటగిరిరూరల్, అక్టోబరు 7 ప్రభాతవార్త:

మండలంలోని రైతులకు ప్రభుత్వం రాయతీలతో వరి విత్తనాలు పంపిణి చేస్తుందని మండల వ్యవసాయశాఖ అదికారిణి సుజాత తెలిపారు. సోమవారం మండల వ్యవసాయ శాఖ కార్యలయంలో రైతులకు వరి విత్తనాలు కోసం పరిమెట్‌లు ఇచ్చారు. యాతలూరు సోసైటి ద్వారా రైతులు వరి విత్తనాలు పొందవచ్చునని తెలియజేశారు. మండలానికి బిపిటిలు 7 టన్నులు,నెల్లూరు మసురలు 17టన్నులు, అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. రైతుల అవసరాన్ని బట్టి విత్తనాలు అందజేసేందుకోసం జిల్లా అదికారులకు నివేదిక ఇస్తామని తెలిపారు.

## సీడ్ సంక్షేమ పథకాలు జిల్లాలో ప్రారంభించండి

సంచార జాతుల జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు

**వెంకటగిరి, అక్టోబర్ 7, ప్రభాతవార్త** తిరుపతి జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారిని వారి కార్యాలయం నందు కలుసుకుని తుపాకుల వెంకటేశ్వర్లు రాష్ట్ర కార్యదర్శి, అఖిలభారత సంచార జాతుల అభివృద్ధి మండలి బిసి జాబితా నందలి మా సంచార కులాల వారికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్నటువంటి సీడ్ ప్రత్యేక పథకాలు జిల్లా నందు ప్రారంభించమని వినతి పత్రం ద్వారా తెలిపారు. సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు చర్యలు తీసుకుంటాం



**డక్కిలి, అక్టోబరు 7 ప్రభాతవార్త** డక్కిలి మండలంలోని అన్నీ గ్రామాల్లో ఉన్న డ్వాక్రా గ్రూపు మహిళలు కుటుంబాలకు ఆసరాగా నిలిచేందుకు అవసరమైన ఆర్థిక వనరులు సాధించేందుకు తగు చర్యలు తీసుకుంటామని డక్కిలి వెలుగు ప్రాజెక్టు ఏపీఎం జమునారాణి తెలిపారు. స్థానిక వెలుగు కార్యలయంలో సోమవారం ఆమె పొదుపు గ్రూపు సంఘాల నిర్వహణ,మహిళలకు సంబందించిన పథకాలు అములు తదితర అంశాలపై కమ్యూనిటీ కోఆర్డినేటర్లుతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ తాను ఇటీవల ఏపీఎంగా బాధ్యతలు చేపట్టినట్లు చెప్పారు. మండలంలోని అన్నీ పొదుపు గ్రూపులు సక్రమంగా నిర్వహించేలా అవసరమైన అన్నీ చర్యలను శాఖాపరంగా తీసుకుంటానని వివరించారు. ఇక ప్రభుత్వం మంజూరు చేసే పథకాలను అర్హులకు అందేలా తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. మరోవైపు పొదుపు గ్రూపుల్లో ఉన్న మహిళలు విరివిగా బ్యాంకులు నుంచి బ్యాంకు లింకేజీ రుణాలు అందేవిదంగా తగు చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఇక డ్వాక్రా సంఘాలు బలోపేతం కోసం అవసరమైన అన్నీ చర్యలు తీసుకుంటామని,కింది స్థాయి సిబ్బంది బాధ్యతగా పనిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ప్రాజెక్టు నాగవోలు సీసీ జి.వెంకటేశ్వర్లు,డక్కిలి సీసీ జీ.సీ.సురేష్, ఆల్తూరుపపాడు సీసీ టి.శ్రీఇవాసులు,లింగసముద్రం సీసీ రాజేశ్వరీ,తదితరులు పాల్గొన్నారు.

## పంచాయితీ పాలనలో భాగస్వాములుగా పనిచేయండి

డక్కిలి, అక్టోబరు 7ప్రభాతవార్తః



పంచాయితీల పాలనలో ఉపసర్పంచ్‌లు,వార్డు మెంబర్లు భాగస్వాములు కావాలని డక్కిలి మండల పరిషత్ అధ్యక్షుడు గోను రాజశేఖర్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉప సర్పంచ్‌లు,వార్డు మెంబర్లుకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ వార్డు మెంబర్లు ఆయా వార్డుల్లో నెలకుని ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. పంచాయతీల్లో జరిగే సమావేశాలకు విదిగా వార్డు మెంబర్లు హాజరు కావాలని చెప్పారు. పంచాయితీల అభివృద్ధి కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈవోపీఆర్డీ అల్లాభక్షు మాట్లాడుతూ ఈ శిక్షణా కార్యక్రమానీ నాలుగు రోజులు పాటు నిర్వహిస్తామని, ఈ కార్యక్రమంలో వివరించిన అంశాలు తెలుసుకుని పంచాయితీ పాలనలో వార్డు మెంబర్లు తగిన పాత్ర పోషించాలని చెప్పారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి,శిక్షణా కార్యక్రమం ఎంవోటీ వెంకటాద్రి పంచాయితీ పాలన,వార్డు మెంబర్లు విధులు,హక్కులు గురించి వివరించారు.

## ఎన్‌బీకెఆర్ విద్యార్థులకు అభినందనలు

కోట, అక్టోబర్ 7 ప్రభాతవార్త

తిరుపతిలోని మెహన్‌బాబు విశ్వవిద్యాలయంలో ఈనెల 4 నుంచి 6 వరకు జరిగిన కోడింగ్ హకథాన్‌లో 183 బృందాలు పాల్గొన్నాయని ఇందులో ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి విద్యార్థులు ప్రధమ బహుమతి గెలుచుకొని విజేతగా నిలిచారని కళాశాల డైరెక్టర్,డాక్టర్, వి.విజయకుమార్ రెడ్డి తెలిపారు. ఆమేరకు విజేతలను డైరెక్టర్ విజయకుమార్ రెడ్డి సిఎస్ఇ విభాగాధిపతి డా.రాజశేఖర్ రెడ్డి, డిఎస్.విభాగాధిపతి నారాయణరావు.కోడింగ్ క్లబ్ ఇన్‌చార్జ్ కోండారెడ్డిలు అభినందించారు. సిఎస్.సి ,ఎఐడిఎస్,ఎస్.ఇ చదువుతున్న నిమ్మల జశ్వంత్ డి. రేణుక, కే.నందిని,జె.జోష్న, కోండిగ్‌లో పాల్గొని హకథాన్‌లో పాల్గొన్ని ప్రథమ బహుమతి సాదించారని పేర్కొన్నారు. విజేతలకు మెహన్‌బాబు విశ్వవిద్యాలయం వారు రూ 35 వేల రూపాయాలను నగదను ప్రశంపత్రంను అంద చేశారని విజయకుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయి

స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ బి. జోజి రెడ్డి, క్రికెట్ టీం చీఫ్ సెలెక్టర్ మల్లిరెడ్డి కోటరెడ్డి

గూడూరు, అక్టోబర్ 7, ప్రభాతవార్త



క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ బి. జోజి రెడ్డి, క్రికెట్ టీం చీఫ్ సెలెక్టర్ మల్లిరెడ్డి కోటరెడ్డిలు పేర్కొన్నారు. సోమవారం గూడూరులోని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో సౌత్ జోన్ యూనివర్శిటీ క్రికెట్ సెలక్షన్స్ నిర్వహించారు. టీం చీఫ్ సెలక్టర్ మలిరెడ్డి కోటారెడ్డి తుది జట్టును ఎంపిక చేశారు. జెఎన్టీయూ అనంతపురం వివిధ జిల్లాల నుంచి 150 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. అందులో క్రీడాకారులలో 16 మందితో కూడిన తుది జట్టును ఎంపిక చేశారు. త్వరలో వీరు చెన్నైలో జరగబోయే సౌత్ జోన్ టోర్నమెంట్‌లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వేణుమాధవ్, ఏవో రామయ్య, పిడి రవిచంద్ర గుడ్లూరు వివిధ కళాశాల నుంచి వ్యాయామ అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఎస్టీకాలనిలో సమస్యలు పరిష్కరించండి ...శంకర్‌నాయక్

దొరవారిసత్రం అక్టోబరు 7 ప్రభాతవార్త;

మండలంలోని ఎస్టీకాలనిలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని ఎస్టీకమిషన్ మెంబర్ శంకర్‌నాయక్ అధికారులను కోరారు. ఆయన సోమవారం దొరవారిసత్రం మండలంలోని కొత్తపల్లి, శ్రీధనమల్లి ఎస్టీకాలనిల్లో పర్యటించి వారిసమస్యలు అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఎస్టీకమిషన్ మెంబర్ శంకర్‌నాయక్ మాట్లడుతూ ఎస్టీకాలనిల్లో నివాసం ఉంటున్న ప్రజలకు తాగునీరు, మరుగుదొడ్లు,రోడ్లు, కాలనిఇళ్ళు,పాఠశాల భవనాలు.విద్యుత్ సర్పరా లాంటి కనీస సౌకర్యాలు కల్పించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తహసిల్దార్ శైలాకుమారి,ఇన్‌చార్జి ఎంపిడిఓ రఘురామయ్య,సిఐ సంఘమేశ్వరావు, సర్పంచ్ నాగూరయ్య,పలుశాఖల అదికారులు,ప్రజలు పాల్గోన్నారు.

## ప్రజాప్రతినిధులకు ఎప్పుడు తగు గౌరవం ఉంటుంది

ఎంపిపి తనుజారెడ్డి

వెంకటగిరి, అక్టోబర్ 7, ప్రభాతవార్త



మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు చెప్పిన సమస్యలను పరిష్కరిస్తామని ఎంపిపి తమ్మిరెడ్డి తనుజ రెడ్డి తెలిపారు. వెంకటగిరి మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపిపి అధ్యక్షతన జరిగింది. గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని పలువురు సర్పంచులు ఎంపిపి దృష్టికి తీసుకొని రాగా పరిష్కరిస్తామని తెలిపారు. సర్పంచులకు ఎలాంటి ప్రాధాన్యత లేకుండా చేస్తున్నారని అమ్మపాలెం సర్పంచ్ మస్తాన్ తెలిపారు. సర్పంచుల ప్రమేయం లేకుండా గ్రామాల్లో సమావేశాలు పెట్టడం ఉపాధి పనులు చేపట్టడం వంటి చేస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్లకు తగిన ప్రాధాన్యత ఇస్తామని ఎంపిపి తెలిపారు. ఉపాధి హామీ పథకం ఏపివో దీప మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే పనులను సర్పంచ్లు వచ్చి పరిశీలించవచ్చని తెలిపారు. ఎంఈఓ బాబయ్య మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు అందరు కృషి చేయాలని తెలిపారు. సమావేశంలో ఎంపిడివో కోటేశ్వర రావు, ఏవో సుజాత, ఈవోపిఆర్‌డి శ్రీనివాసులు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు సుధాకర్, పెంచలయ్య, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

## మద్యం షాపులకు 9వ తేది లోపల దరఖాస్తులు చేసుకోవాలి

సహాయ కమిషనర్ శ్రీనివాసచారి

వెంకటగిరి, అక్టోబర్ 7, ప్రభాతవార్త

ఈ నెల తొమ్మిదో తేది లోపల మద్యం షాపుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఎక్సైజ్, ప్రొహిబిషన్ సహాయ కమిషనర్ శ్రీనివాసచారి తెలిపారు. వెంకటగిరి ఎక్సైజ్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు లక్షల రూపాయిలు డిపాజిట్ చేసే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 2 లక్షల రూపాయిలు డిపాజిట్ ఇక తిరిగి ఇవ్వరని తెలిపారు. ఆన్‌లైన్‌లో కానీ ఆప్‌లైన్‌లో కానీ దరఖాస్తులు చేసుకోవచ్చని చెప్పారు. ఇన్స్పెక్టర్ సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

## ముత్తూట్ మినీ ఫైనాన్స్ సహకారంతో మహిళకు కుట్టు మిషన్ పంపిణీ

గూడూరు, అక్టోబర్ 7, ప్రభాతవార్త

గూడూరులో కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ముత్తూట్ మినీ ఫైనాన్స్ సహకారంతో మహిళలకు స్వయం ఉపాధి కల్పనలో భాగంగా కుట్టు మిషన్‌ను సోమవారం సంస్థ తిరుపతి ఏరియా మేనేజర్ పి. గోపినాథ్ చేతుల మీదుగా మావ్యనగర్ ప్రాంతానికి చెందిన బొలిగర్ల ఈశ్వరికి పంపిణీ చేశారు. మహిళలకు ప్రత్యేక అతి తక్కువ వడ్డీ రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తు కాలంలో ఎలాంటి సేవ కార్యక్రమాలు ఇంకా మరెన్నో చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు బ్రాంచ్ మేనేజర్ టి. అనీల్ కుమార్, సిబ్బంది అనూష, స్వప్న, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన పి. శ్రీనివాసులు

బాలాయపల్లి, అక్టోబర్ 7, ప్రభాతవార్త



బాలాయపల్లి మండల నూతన తహశీల్దార్‌గా పి. శ్రీనివాసులు బాధ్యతలను చేపట్టారు. బదిలీలో భాగంగా బాలాయపల్లి మండలంకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా మండలంలో పనిచేసే సర్వేయర్లు నూతన తహశీల్దార్ పి. శ్రీనివాసులుకు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. టి. రాజశేఖర్, వెంకన్న బాబు, దిలీప్, ప్రసాద్, అఖిలేష్, ఉమా కవిత తదితరులు పాల్గొన్నారు.

## నూతన బాధ్యతలు చేపట్టిన ఎంపిడివో

గూడూరు, అక్టోబర్ 7, ప్రభాతవార్త

గూడూరు ఎంపిడివోగా మధుసూదన్ రావు సోమవారం బాధితులు చేపట్టారు. గతంలో నెల్లూరు జిల్లా అనంతసాగర్ మండలంలో పనిచేస్తూ బదిలీపై రావడం జరిగింది. అదేవిధంగా ఇక్కడ పనిచేస్తున్న వెంకటేశ్వర్లు తోటపల్లి గూడూరు మండలంకి బదిలీ అవ్వడం జరిగింది. బాధ్యతలు చేపట్టిన అనంతరం పంచాయితీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించి పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు

## గోమాత వ్యాపారస్తుడు ఇంటికి

శ్రీకాళహస్తి, అక్టోబర్ 7 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో అక్రమ వ్యాపారాలకు, అక్రమ వసూళ్ళకు దొడ్డి దారి సంపాదనలకు ఆలయ ఇఒ ఎస్ ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ చెక్ పెడుతున్నారు. ఈ నేపథ్యంలో వెంకటేశ్వర్లు అనే వ్యక్తిని విధుల నుంచి తొలగించినట్లు తెలిసింది. శ్రీకాళహస్తీశ్వరాలయానికి నాలగవ గేటునుంచి ప్రవేశించే భక్తులు, వివిపిలకు దక్షిణ గోపురం వద్ద ఓ గోమాతను ఏర్పాటు చేసుకొని దానిని దారికడ్డంగా నిలిపి రాకపోకలకు ఇబ్బంది కల్గిస్తూ వసూళ్ళు చేసుకొని జేబులు నింపుకునే వారు. ఈ సమస్య కొంత కాలంగా ఉండేది. దీనిని గమనించిన ఇఒ చంద్రశేఖర్ ఆజాద్ వెంటకే అక్కడ గోమాతను బాగా వెనుకకు నిర్ణీత స్థలంలో నిలిపి పూజలు చేయాలని ఆదేశించారు. గోమాతను చూపి వ్యాపారం చేస్తున్న వెంకటేశ్వర్లును నిలిపివేయాలని ఆదేశించారు.

## ఆలయాలకు చేయూత: పరిచారకుల సమస్యలు పరిష్కారం:

శ్రీకాళహస్తి, అక్టోబర్ 7 ప్రభాతవార్త



రాష్ట్రంలోని దేవాలయాల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచుటకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేపట్టిన చర్యలు తీసుకోవటం హర్షణీయం బ్రాహ్మణ సాధికార కమిటి రాష్ట్ర కన్వీనర్ కలపటపు బుచ్చిరాంప్రసాద్ అన్నారు. సోమవారం వారు శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వచ్చారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్న ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆలయాలను ఆదుకొనుటకు నిర్ణయం తీసుకోవటం అభినందనీయం అన్నారు. ధార్మికతపై చంద్రబాబునాయుడు గుర్తింపుకు నిదర్శనం అన్నారు. ముఖ్యమంత్రి ఖాయిలా దేవాలయాలకు ధూప దీప నైవేద్యం పథకంలో రూ. 10వేల కు పెంచుతూ జిఒ జారి చేయటం అభినందనీయం అన్నారు. కాగా బెజవాడ కనకదుర్గమ్మ ఆలయంలోని పరిచారకుల సమస్యలను పరిష్కరించి ఆదుకున్నారన్నారు. ఇక నారాలోకేష్ ఎన్నికల ముందు పాదయాత్రలో నిరుద్యోగ వేదపండితులకు నిరుద్యోగ భృతి త్వరలోనే ఇవ్వటానికి చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించటం హర్షణీయం అన్నారు. ఆయనతో పాటు బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి జిల్లా కన్వీనర్ చిత్రపు హనుమంతరావు, సురేష్‌కుమార్‌లు పాల్గొన్నారు.

## రామాపురం రెవెన్యూ భూములకు హద్దులు చూపండి

శ్రీకాళహస్తి రూరల్, అక్టోబర్ 7 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం రామాపురం రెవెన్యూ భూములకు సంబంధించి సర్వే జరిపి హద్దులు చూపాలని బికేయంయు డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం ఆర్‌డిఓ కార్యాలయం ఎదుట నియోజకవర్గ కార్యదర్శి ఎం. శివకుమార్ సారధ్యంలో డిమాండ్‌చేసారు. రామాపురం గ్రామం వద్ద రెవెన్యూశాఖ దళితులకు ఇచ్చిన భూములకు సంబంధించి సర్వే జరిపి హద్దులు చూపాలని ఆర్‌డిఓ కార్యాలయం వద్ద ఆందోళన చేసారు. దశాబ్దాలు గడుస్తున్నా భూ సమస్యలు పరిష్కరింపబడటం లేదని వాపోయారు. రామాపురంలో రెవెన్యూలో మండలంలోని అమ్మపాళెం,, పుల్లారెడ్డి కండ్రిగ, తొండమనాడు, ఎగువవీధి తదితర గ్రామాలకు చెందిన నిరుపేదలకు భూములిచ్చారన్నారు. 1991లో బ్లాక్ నెంబర్ 400, 401, 419లో సుమారు 120 ఎకరాల భూములను అందించారన్నారు. ఈ భూముల్లో దళితులు వర్షాధార పంటలు పెట్టుకొని జీవనం సాగిస్తున్నారని వివరించారు. ఎన్నో సార్లు అధికారుల చుట్టూ, ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకోలేదన్నారు. దళితులకు అందించిన భూములు రెవెన్యూశాఖ నిర్లక్ష్యంతో అన్యాక్రాంతమై శాంతి భద్రతల సమస్యలు తలెత్తక ముందే సర్వే జరిపి న్యాయం చేయాలని డిమాండ్‌చేసారు. తలారి మనీ, పాముంజు శ్రీనివాసులు, కిన్నెరదశరథయ్య తదితరులు పాల్గొన్నారు.

## దేవస్థానం భోజనం సరిపోవటం లేదు:

శ్రీకాళహస్తి, అక్టోబర్ 7 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయం ఏరియా ఆసుపత్రికి పంపుతున్న భోజనం సరిపోవటం లేదని కొంద రికి అందిం చి, మరి కొందరికి సరిపోక పోవటం ఇబ్బందిగా ఉందని సోమవారం ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన శాసనసభ్యుడు బొజ్జల బృందమ్మ దృష్టికి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మీ వివరించారు. ప్రస్తుతం దేవస్థానం 120 మంది రోగుల అటెండర్లకు భోజనం పంపిస్తున్నారని అది చాలటం లేదని కనీసం 150మందికి సరఫరా చేసే అవకాశం కల్పించాలని కోరగా బృందమ్మ తాను శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి దృష్టికి తెచ్చి కోరిన మేరకు అందించుటకుఏర్పాట్లు చేస్తామన్నారు. కాగా వార్డుల్లో రోగులతో మమేకమయ్యారు. వారితో ముచ్చటిస్తూ సమస్యలేమైనా ఉన్నాయా? అని అడిగి తెలుసు కున్నారు.

***క్యాంటిన్ పరిశీలన:*** కాగా ఆర్‌టిసి బస్టాండుకు సమీపంలోని 'అన్నా క్యాంటిన్'ను బృందమ్మ ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఇక్కడ ఇస్కాన్ వారు భోజనం సరఫరా చేస్తున్నారు. ఆర్‌టిసి బస్టాండు వద్ద క్యాంటిన్‌ను మాజీ కౌన్సిలర్ బషీర్, జయరామారావు పార్కు వద్ద క్యాంటిన్ మాజీ కౌన్సిలర్ నాగమల్లి దుర్గా ప్రసాద్, వినయ్‌లుపర్యవేక్షిస్తున్నారు. ఆమెతోపాటుమాజీకౌన్సిలర్‌బూడివాకంరేణుకమ్మ, మల్లీశ్వరిపాల్గొన్నా రు.

## విద్యుత్ డిఈఈలు నియామకం

-మెరుగైన విద్యుత్ సేవలు అందించడమే లక్ష్యం

.తొట్టంబేడు, అక్టోబర్ 7 ప్రభాతవర్తా



శ్రీకాళహస్తి చెన్నై రోడ్డులో వెలసి ఉన్న 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో టౌన్, రూరల్, డిఈఈలు, టౌన్ ఎఈఈలు బదిలీ అయ్యారు. ఈనేపధ్యంలో టౌన్ డిఈఈగా పనిచేస్తున్న సతీష్‌బాబు బదిలీపై రేణిగుంటకు బదిలీకాగా ఈయన స్థానంలో పీలేరులో పనిచేస్తున్న సుధాకర్ డిఈఈగా బాధ్యతలు స్వీకరించారు. ఇక రూరల్ డిఈఈగా పనిచేస్తున్న సాయిశంకర్ మదనపల్లికి బదిలీ కాగా ఆయన స్థానంలో శ్రీకాళహస్తికి చెందిన సుబ్రమణ్యం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన తొట్టంబేడు ఎఈఈగా, శ్రీకాళహస్తి డిఈఈగా బాధ్యతలు స్వీకరించి, కొద్దిరోజులు విజిలెన్స్ శాఖలో పనిచేసిన అనంతరం తిరుపతిలోని ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. ప్రస్తుతం రూరల్ డిఈఈగా బాధ్యతలు స్వీకరించారు. ఎఈఈగా పనిచేస్తున్న కుమార్ బాబు మదనపల్లికి బదిలీ కాగా ఇక్కడకు వరదయ్యపాళెంలో పనిచేసున్న శివప్రసాద్‌ను నియమించారు.

## సేంద్రీయ వ్యవసాయ పంటలే ఆరోగ్యానికి శ్రేయస్కరం

.తొట్టంబేడు, అక్టోబర్ 7 ప్రభాతవార్త



సేంద్రీయ వ్యవసాయ పంటలే ఆరోగ్యానికి శ్రేయస్కరం అని పలువురు సేంద్రీయ వ్యవసాయ రైతులు అన్నారు. సేంద్రీయ వ్యవసాయ కార్యక్రమంలో భాగంగా ప్రతి సోమవారం ఎపిసిఎన్ఎఫ్ ఆధ్వర్యంలో తొట్టంబేడు ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో సేంద్రీయ వ్యవసాయంతో పండించిన కూరగాయల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. వీటిలో గోంగూర, మునగాకు, వంకాయలు, బెండకాయలు, ఇతర ఆకుకూరలు, కూరగాయాలు ఉన్నాయి. మండలంలోని పెద్దకనపర్తి, పూడి, కాసరం గ్రామాలకు చెందిన యూనిట్‌లో పి. సుధాకర్ నాయుడు, ఎ. పద్మావతి, జి. లీనాభార్గవిలు సేంద్రీయ వ్యవసాయంతో పండించిన ఆకు కూరలు, ఆరోగ్యానికిఎంతో మంచిదని రసాయన ఎరువులతో పండించిన పంటలు ఆరోగ్యానికి మంచిది కాదన్నారు.

## అంగన్‌వాడీల సమస్యల పరిష్కారమే లక్ష్యం

.తొట్టంబేడు, అక్టోబర్ 7 ప్రభాతవార్త



అంగన్‌వాడీ సమస్యల పరిష్కారమే లక్ష్యమని శ్రీకాళహస్తి ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ శాంతిదుర్గ ఓ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆమె సోమవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 148 అంగన్‌వాడీ మెయిన్, మినీ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఇక సూపర్‌వైజర్లు 6 మంది ఉండగా తొట్టంబేడు-1, 2లకు సూపర్‌వైజర్ రాజేశ్వరి, తొట్టంబేడు-3కు ఉష, మున్సిపాలిటీకి సూపర్‌వైజర్‌గా హరిత, ఊరందూరు సెక్టార్‌కు బజావతి, ఎంపేడు సెక్టార్‌కు మంజుల, ఉండగా మరో సూపర్‌వైజర్ రేవతి ఆనారోగ్యంతో సెలవులో ఉన్నారని త్వరలోనే కోలుకుని బాధ్యతలు స్వీకరిస్తారన్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడ సమస్యలు తెలుసుకోవడంతో పాటు గర్భిణీస్త్రీలు, బాలింతలకు సరిగ్గా పౌష్టికాహారం అందుతోందా?లేదా అని పరిశీలించడంతోపాటు చిన్నారుల బరువును పరిశీలిస్తామన్నారు. ఏ అంగన్‌వాడీ కేంద్రంలో అయినా సమస్యలు ఉన్నట్లు తెలిస్తే వెంటనే పాత్రికేయులు తనకు సమాచారం అందించాలని కోరారు. ఇక రామచంద్రాపురం గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని మరో భవనంలోకి మార్చివేస్తామని తెలిపారు.

## తొట్టంబేడు ఎంపిడిఓగా సురేంద్రనాద్

తొట్టంబేడు, అక్టోబర్ 7 ప్రభాతవార్త

తొట్టంబేడు ఎంపిడిఓగా పి. సురేంద్రనాథ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన తంబళ్ళపల్లెలో పనిచేశారు. ఇక్కడ ఎంపిడిఓగా పనిచేసిన సురేష్‌బాబు పలమనేరు నియోజకవర్గం గంగవరం మండలానికి బదిలీ అయ్యారు. ఈసందర్భంగా ఆయన్ను వైకాపా సీనియర్ నాయకులు ఉన్నంవాసుదేవనాయుడు మర్యాదపూర్వకంగా కలసి దుశ్శాలువతో సత్కరించారు. కాగా సూపరింటెండెంట్ మధుసూధన్, సీనియర్ అసిస్టెంట్ జనార్ధన్, జూనియర్ అసిస్టెంట్ మునిరత్నంలు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

## రాష్ట్ర మహిళా చైల్డ్ వెల్ఫేర్ మంత్రికి స్వాగతం

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 7 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరస్వామి అమ్మవార్ల దర్వనానికి విచ్చేసిన రాష్ట్ర ఉమెన్ చైల్డ్ వెల్ఫేర్ అండ్ ట్రైబల్ శాఖ మంత్రి జి. సంధ్యారాణిలకు శ్రీకాళహస్తి ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ శాంతిదుర్గ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో శ్రీకాళహస్తీశ్వరస్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. అంతేకాకుండా ఆమెకు ఐసిడిఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్లు, సిబ్బంది స్వాగతం పలికారు.



## మా ఉనికిని కాపాడండి

ఆల్ ఇండియా బంజార సేవా సంఘం

తిరుపతి హెల్త్, అక్టోబర్ 7, ప్రభాతవార్త



దేశవ్యాప్తంగా బంజారా జాతులు ఉనికిని కోల్పోతున్నారని ఆల్ ఇండియా బంజార సేవా సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు శివ నాయక్ తెలియజేశారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో సోమవారం మీడియా ముందు ఆ సంఘం నాయకులు కిషోర్, హరిబాబు, నందకిషోర్, అంజి, హరిచౌహన్, శివ, శంకర్, బాలాజీ నాయక్‌లతో కలిసి శివ మాట్లాడుతూ మహారాష్ట్రలోని పొరదేవి ప్రాంతంలో ప్రధాని మోడీ చేతుల మీదుగా బంజారాల చారిత్రాత్మిక మ్యూజియం ప్రారంభోత్సవంను విజయవంతం చేసిన బంజారాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర రాజస్థాన్, కర్ణాటక, హర్యానా, నిర్మల్ తదితర రాష్ట్రాల నుండి బంజారాలు హాజరయ్యారని తెలిపారు. తిరుపతిలో హతిరాంజీ భూములకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ భూములను కాపాడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు

బ్రహ్మణ సాధికార సమితి వెల్లడి

తిరుపతి హెల్త్, అక్టోబర్ 7, ప్రభాతవార్త



గత ఎన్నికల్లో బ్రహ్మణ కులస్తులకు ఇచ్చిన 9 హామీలలో ఏడు హామీలను అమలుపరిచి కూటమి ప్రభుత్వం మాట నెలబెట్టుకుందని బ్రహ్మణ సాధికార సమితి స్టేట్ కన్వీనర్ బుజ్జి రాంప్రసాద్ కొనియాడారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో సోమవారం మీడియా ముందు బ్రాహ్మణ నేతలు హనుమంతరావు, బి. జయలక్ష్మిలతో కలిసి బుజ్జి మాట్లాడుతూ అన్ని దేవాలయాలలో, టిటిడి పాలకమండలితో సహ బ్రాహ్మణులలో ఒకరికి చోటు కల్పిస్తామని సిఎం చంద్రబాబు నాయుడు మాట ఇచ్చారని తెలిపారు. చిన్న ఆలయాలలో ధూప దీప నైవేద్యాలకు, గతంలో ఇస్తున్న 5000ను ఇప్పుడు 10000గా పెంచడం హర్షనీయం అన్నారు. అలాగే తమకు వంద రోజుల కూటమి పాలనలో రెండు కోట్ల 50 లక్షలు లోన్ ఇవ్వడం సంతోషకరమన్నారు. బ్రాహ్మణులు చేసే వంట వృత్తిని కులవృత్తిగా చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

## మేమున్నాం....

ప్రశాంతంగా గరుడసేవవీక్షించండి

తిరుమలేశుని బ్రహ్మోత్సవాల్లో గరుడసేవకు భక్తులకు పూర్తిభద్రత కల్పించామని తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడుభరోసానిచ్చారు. ఎక్కడా హడావుడి లేకుండా ప్రశాంతంగా గరుడసేవ దర్శించాలని కోరారు.

## స్వామికి కాదు ధర్మానికి సేవ చేయాలనుంది

ఆధ్యాత్మిక శ్రీమూర్తి లెక్చరర్ సుధావాణి బృందం విజ్ఞప్తి

తిరుపతి హెల్త్, అక్టోబర్ 7, ప్రభాతవార్త



ఆ దేవదేవుని పాదాల చెంత పుట్టి ధర్మో రక్షతి రక్షిత అనే సూక్తిని పాటిస్తూ తల్లిదండ్రుల నుంచి పుణికి పుచ్చుకున్న స్వామి భక్తిని చిన్ననాటి నుంచి నేటి వరకు ఆరాధ్య దైవంగా శ్రీవారిని స్మరించుకుంటూ జీవిస్తున్న తనకు తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యురాలిగా ఒక్క అవకాశం ఇవ్వాలని శ్రీ చైతన్య విద్యా సంస్థలలో ఫిజిక్స్ లెక్చరర్‌గా పనిచేసే డాక్టర్ నాగ సుధావాణి వారి సౌందర్య లహరి మహిళా సేవా సమితి సభ్యులు హేమలత, పూర్ణిమ, ఉమామహేశ్వరిలతో కలిసి తిరుపతి ప్రెస్ క్లబ్‌లో సోమవారం సుధావాణి మనసులోని మాటను తెలియజేశారు. వారు మాట్లాడుతూ తిరుమలగిరి క్షేత్రం పై ఆ శ్రీవారి దేవేరి లక్ష్మీదేవి భూత కారుణ్య లక్ష్మిగా వేంచేసిందని కలియుగ ఆరంభాన్ని గుర్తు చేశారు. టిటిడి బోర్డులో మహిళలకు అవకాశం ఇస్తే స్వామి మీద భక్తి కంటే ధర్మాన్ని కాపాడాలనే యుక్తితోనే స్వామి మెప్పు పొందుతామని తెలిపారు. శ్రీవారే తనకు సిఫార్సు చేస్తాడన్న ఒక్క నమ్మకంతో మీడియా ముందుకు వచ్చినట్లు తెలిపారు. ధర్మాన్ని కాపాడాలనే తన మనసులోని భావాన్ని సిఎం చంద్రబాబు అర్థం చేసుకుని అవకాశం కల్పించాలని కోరారు.

## ఇష్టానుసారం రోడ్డును తవ్వేస్తున్నారు

విజయపురం, అక్టోబరు 7 ప్రభాతవార్త:



తారు రోడ్లను ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారని జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు చుక్కా ధనంజయయాదవ్ ఆరోపించారు. రోడ్డు వేయడానికి కోట్లు వెచ్చిస్తుంటే ప్రైవేటు టెలికాం సంస్థ వారు ఇష్టానుసారం పైపులైన్లను రోడ్డును నాశనం చేస్తున్నారని వాపోయారు. రాజీవ్ టెక్నాలజీ పైపులైన్ తాగునీరు, పంచాయతీ పైపులైన్ రోడ్డు పక్కన పోతున్నా పట్టించుకోకుండా ధ్వంసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రోడ్డుకిరువైపులా మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో చెట్లు పెంపకం చేస్తుంటే వాటిని విచక్షణా రహితంగా ధ్వంసం చేస్తున్నారని, ఈ విషయమై అధికారులు పట్టించుకోవాలని డిమాండ్ చేశారు.

## విజయపురం ఇన్‌చార్జి ఎంపీడీవో బాధ్యతలో గందరగోళం

**విజయపురం, అక్టోబరు 7 ప్రభాతవార్త:** విజయపురం ఇన్‌చార్జి ఎంపీడీవో నియామకంలో గందరగోళం నెలకొంది. విజయపురంలో ఎంపీడీవోగా పని చేస్తున్న చంద్రమౌళీ ఈ నెల 3న బదిలీపై కార్వేటినగరం వెళ్లారు. ఆయన ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న సమయంలోనే గత నెల 22న విజయపురంలో ఏవోగా విధులు నిర్వహిస్తున్న రమణప్రకాష్‌కి ఇన్‌చార్జి ఇస్తూ జిల్లా అధికారులు బాధ్యతలు అప్పగించారు. అనంతరం మండలాల వారి అధికారులను నియమించడంతో నగరి ఈవోపీఆర్‌డీ అరుణమ్మకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా గత నెల 30న జిల్లా అధికారులు బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు తీసుకున్న అరుణమ్మ రెండు రోజులు చిత్తూరులో శిక్షణలో ఉండడంతో విజయపురంలో బాధ్యతలు స్వీకరించలేదు. అనంతరం గతంలో ఇచ్చిన ఆర్డర్‌తో ఏవో రమణప్రకాష్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. మౌఖిక ఆదేశాలు అందిందని, కానీ విజయపురం ఏవో నగరి ఈవోపీఆర్‌డీ బాధ్యతలు ఇస్తేనే తీసుకుంటామని పట్టు పట్టడంతో గందరగోళం నెలకొంది. ఏవో శిక్షణ నిమిత్తం శ్రీకాళహస్తికి వెళ్ళడంతో పంచాయతీ కార్యదర్శులను రిలీవ్ చేయాలన్నా, జాయిన్ చేసుకోవాలన్నా ఇబ్బందిగా మారింది. ఎంపీడీవో లేకపోవడం వలన గందరగోళం నెలకొంటున్నది.

## ప్రజల నుండి ప్రజా పరిష్కార వేదికకు 43 వినతులు

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 7, ప్రభాతవార్త



ప్రజల సమస్యలను పరిష్కారమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య అధికారులను ఆదేశించారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి 43 వినతులు వచ్చాయి. వచ్చిన అన్ని వినతులను కమిషనర్ క్షుణ్ణంగా పరిశీలించి ఆయా విభాగాల అధికారులు పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన వినతులను తక్షణమే పరిష్కరించడమే ధ్యేయంగా అధికారులు పనిచేయాలని అన్నారు. ఆయా విభాగాలకు వచ్చిన వినతులకు వారే పరిష్కరించి, ఫిర్యాదు దారులకు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మున్సిపల్ ఇంజనీర్లు తులసి కుమార్, గోమతి, డిఈలు మహేష్ రాజు, లలిత, వెంకట ప్రసాద్, మోహన్, ఏసిపిలు రమణ, బాలాజీ, రెవెన్యూ ఆఫీసర్లు సేతుమాదవ్, రవి, మేనేజర్ హీసిమ్, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, శానిటరీ సూపర్‌వైజర్స్ చెంచయ్య, సుమతి, తదితరులు ఉన్నారు.

## ప్రజల సమస్యలు పరిష్కరించడానికి ఎల్లవేళలా అందుబాటులో పోలీసులు

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 7, ప్రభాతవార్త

ప్రజల సమస్యల పరిష్కరించడానికి ఎల్లవేళలా పోలీసులు అందుబాటులో ఉంటారని సిఐలు శ్రీనివాసులు, ఎస్బి సుబ్రమణ్యంలు పేర్కొన్నారు. సోమవారం జిల్లా ఎస్పి సుబ్బరాయులు ఆదేశాలు మేరకు సిఐలు డిసిఆర్బి ప్రజా వారితో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుండి జిల్లా పోలీసు కార్యాలయంలో 46 ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని సంబంధింత పోలీస్ అధికారులకు సమాచారం అందించి సకాలంలో విచారించి చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని ప్రజలు జిల్లాలోని పోలీస్ స్టేషన్‌లో సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాలలో పిర్యాదు చేయవచ్చునని ఆ పిర్యాదులనుకూడాప్రజాసమస్యపరిష్కారవేదికఫిర్యాదులుగానేపరిగణిస్తామని జిల్లా పోలీసులు ప్రజలకు తెలిపారు.

## శివయ్య సేవలో మంత్రి పూజలు

శ్రీకాళహస్తి, అక్టోబర్ 7 ప్రభాతవార్త



దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరా లయంలో సోమవారం భక్తులతో కిట కిటలాడింది. దేవి నవరాత్రి మహోత్సవాలు జరుగుతున్న నేపధ్యంలో సోమవారం ఉదయం మహిళా సాంఘీక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి జి. సంధ్యారాణి కుటుంబసభ్యులతో దర్శించుకున్నారు. ఆమెకు దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో వేదపండితులతో స్వాగతం పలికారు. ఆలయ ఇఒ ఎస్ఎస్‌చంద్రశేఖర్ ఆదేశాలతో డెప్యూటీ ఇవో ఎన్ ఆర్ కృష్ణారెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆలయంలోని స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. ఆలయ ఇన్సె పెక్టర్ హరియాదవ్, ఎపిఆర్ఓ రవి పర్యవేక్షించారు.

# తిరుపతి డివిజన్

## రామానుజపల్లి అభివృద్ధికి సహకరించండి

-ఎంపిడిఓ రామచంద్రను కొరిన రామానుజపల్లి నాయకులు



**తిరుపతిరూరల్, అక్టోబర్ 07 ప్రభాతవార్త:** తిరుపతిరూరల్ మండలం రామానుజపల్లి గ్రామ పంచా యతీ అభివృద్ధికి సహకారం అందించాలని ఆ పంచాయతీ గ్రామస్తులు కోరారు. ఈ మేరకు సోమవారం ఎంపిడిఓ రామచంద్రను మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలవతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసారు. దినదినాభివృద్ధి చెందుతున్న రామానుజపల్లిలో ఇంకా అభివృద్ధి పనులు చేయాల్సిం దన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోహనక్రిష్ణ, మునిరత్నం, పొట్టేలి రవికుమార్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమి ఆక్రమణకు అడ్డుకట్ట వేయండి

-ప్రభుత్వభూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయండి

తిరుపతిరూరల్, అక్టోబర్ 07 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ మండలం సి. మల్లవరం గ్రామ పంచాయతీ పరిధిలోని గాంధీనగర్‌లో కోట్ల రుపాయాలు విలువ చేసే ఖరీదైన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైతుందని, ప్రభుత్వభూమి ఆక్రమణకు గురికాకుండా పరిరక్షించాలని ఆ పంచాయతీకి చెందిన మొక్కల తిమ్మారెడ్డి, లోకనాధరెడ్డి, సిద్దారెడ్డిలు కోరారు. ఈ మేరకు సోమవారం తిరుపతిరూరల్ తహశీల్దార్ రామాంజులనాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేసారు. గాంధీనగర్ సర్వేనెంబర్ 323లో సుమారు 30సెంట్ల ప్రభుత్వభూమి కలదని, ఆ భూమిని అదే గ్రామానికి చెందిన వ్యక్తులు కబ్జాకు ప్రయత్నించి, రాత్రికి రాత్రే అక్రమ నిర్మాణాలు చేపడుతున్నాడని ఫిర్యాదు చేసారు. ప్రభుత్వభూమి ఆక్రమణను అరికట్టాలని గతంలో గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఫలితం లేదన్నారు. కోట్ల రుపాయాలు విలువ చేసే ప్రభుత్వభూమిని సర్వే చేయించి, హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని, ఆక్రమణకు యత్నిస్తున్నవారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.

## గోవింద మాల భక్తులకు ఓంశక్తి ఆలయంలో అన్నదానం



**నగరి, అక్టోబరు 7 ప్రభాతవార్త:** నగరి పట్టణంలో ఉన్న ఓం శక్తి ఆలయంలో తమిళనాడుకు చెందిన పాండిచ్చేరి, విలుపూరం, దిండివనం, చంగల్‌పట్టు, పట్టణం నుంచి కాలినడకన తిరుమలకు వెళ్లి భక్తులకు స్థానిక గోవిందమాల భక్తుల బృందం సేవా సభ్యులచే ఓం శక్తి ఆలయంలో సుమారు 750 మందికఇ పైగా అన్నప్రసాదం వినియోగించారు. ప్రతి సంవత్సరం గోవిందమాల భక్తులకు పాదయాత్ర ద్వారా తిరుమలకు వెళ్లే పలు పట్టణాల నుంచి వచ్చే భక్తులకు స్థానిక భక్తులసహకారంతో అన్న ప్రసాదం వినియోగం చేయడం ఆనవాయితీ కార్యక్రమం. కోనేరు సుబ్రహ్మణ్యం మొదలి, కోనేరు ఆర్ముగం మొదలి, పర్యవేక్షణలో రిటైర్డ్ ఎస్ఐ పెరుమాలు, కృపానిధి, దయానిధి, రమేష్ మొదలియార్ గోపాల్‌రెడ్డి, రామ్మోహన్‌రావు, కీళపట్టు చంద్రారెడ్డి, ఎల్లప్పరెడ్డి, వేలనాయుడు, కుమార్, చంద్రమోహన్ కుమార్, కోనేరు మురళి, కోలా బాలాజీ పాల్గొన్నారు.

## శ్రీభువనేశ్వరి దేవి అలంకరణలో దుర్గామాత

రామచంద్రాపురం, అక్టోబర్ 7 ప్రభాతవార్త:



రాయలచెరువు కట్ట సమీపంలో వెలసియున్న శ్రీశక్తి పీఠంలో సోమవారం శ్రీభువనేశ్వరి దేవి అలంకరణలో దుర్గామాత భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి కుర్తాళం పీఠాధిపతి సిద్దేశ్వరానంద మహాభారతి స్వామి పర్యవేక్షణలో పీఠాధీశ్వరి రమ్యానంద భారతి వివిధ సుగంధ ద్రవ్యాలతో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. నూతన వస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో అమ్మవారిని శ్రీభువనేశ్వరి దేవి తీర్చిదిద్దారు. అనంతరం ముత్తైదువులు సువాసినీ పూజ, బాలపూజ నిర్వహించారు. మాతాజీ అమ్మవారికి విశిష్ట పూజలు గావించి, దర్బారు సేవ నిర్వహించారు.

## శ్రీలలితదేవి అలంకరణలో ఏకవీరదేవి

రామచంద్రాపురం, అక్టోబర్ 7 ప్రభాతవార్త:



సూరావారిపల్లి సమీపంలో వెలసియున్న సురభీ గోసంరక్షణశాలలో శ్రీలలితదేవి అలంకరణలో ఏకవీరదేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఏకవీర సేవ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామీజీ అమ్మవారికి సోమవారంవివిధ రకాల సుగంధభరిత పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. నూతన వస్త్రాలు, పలురకాల పుష్పాలతో అమ్మవారిని శ్రీలలితదేవిగా తీర్చిదిద్దారు. అనంతరం అమ్మవారికిగోశాలప్రదక్షిణచేసి, దర్బారు సేవ, కుంకుమార్చనలు నిర్వహించారు.

## రేణిగుంట క్రీడా మకుటాలు

బంగారు పతకం దక్కించుకున్న గ్రేసి



***రేణిగుంట, అక్టోబరు 7 ప్రభాతవార్త:*** రేణిగుంట బాలికల ప్లస్‌టు పాఠశాల విద్యార్థినులు కృష్ణా జిల్లా ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయిలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన రెజ్లింగ్ పోటీల్లో 8 పతకాలు సాధించి రేణిగుంట కీర్తి బావుటాను ఎగురవేసి క్రీడా మకుటాలుగా అందరి మన్ననలు పొందుతున్నారు. 19 సంవత్సరాల లోపు విభాగంలో ఒక బంగారు పతకం, రెండు కాన్స పతకాలు, 14 సంవత్సరాల లోపు విభాగంలో నాలుగు వెండీ పతకాలు, ఒక కాంస్య పతకం దక్కించుకునఇ ఓవరా చాంపియన్‌షిప్‌గా రేణిగుంటకు వన్నెతెచ్చారు. బంగారు పతకం సాధించిన గ్రేసి జాతీయ పోటీల్లో పాల్గొనడానికి అర్హత సంపాదించింది. ఆమె అక్టోబరు 23 తేదీ నుంచి 27 తేదీ వరకు ఢిల్లీలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటుంది. వీరిని పాఠశాల ప్రధానాచార్యులు విష్ణువర్ధనం, ఫిజికల్ డైరెక్టర్ రేఖారాణి, బోధన బోధనేతర సిబ్బంది, పూర్వవిద్యార్థులసంఘంనాయకులు, సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు కమిటీ అభినందించారు.

## రేణిగుంట ఎంపీడీవోగా విష్ణు చిరంజీవి కొనసాగింపు

రేణిగుంట, అక్టోబరు 7 ప్రభాతవార్త:

రేణిగుంట ఎంపీడీవోగా విష్ణు చిరంజీవిని కొనసాగిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. తెలుగుదేశ కూటమి ప్రభుత్వం(ఎన్‌డీఏ) ఏర్పడిన అనంతరం ఎంపీడీవోల బదిలీల ప్రక్రియ మొదలైనప్పుడు నుంచి రేణిగుంట ఎంపీడీవో ఎవరన్నది ప్రశ్నార్థకంగా మారింది. బదిలీల ప్రక్రియలో భాగంగా రమేష్‌బాబు ఎంపీడీవోగా బదిలైనట్లు విస్తృతంగా ప్రచారం జరిగింది. ప్రస్తుత ఎంపీడీవోగా ఉన్న విష్ణు చిరంజీవిని రేణిగుంట నుంచి బదిలీ చేశారన్న ప్రచారాలు లేకపోలేదు. రేణిగుంట పరిస్థితి ఆలస్యం కావడంతో మండలంలో సామాన్య ప్రజల నుంచి రాజకీయ నాయకులు ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు రకరకాలుగా చర్చించుకున్నారు. ఎంపీడీవో ఎవరన్నది సందిగ్ధావస్థలో పడింది. ఉన్నత స్థాయి అధికారులు కూడా సరైన సమాచారం ఇవ్వలేకపోయారు. సోమవారం ప్రభాతవార్త ప్రతినిధి జిల్లా పరిషత్ సీఈవో రవికుమార్‌నాయుడు అడుగగా ప్రస్తుత ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న విష్ణు చిరంజీవి రేణిగుంట ఎంపీడీవోగా కొనసాగుతారని తెలియజేశారు. దీంతో ఎంపీడీవో ఎవరన్న అనుమానాలకు తెరదింపినట్లయింది.

## శ్రీకాళహస్తి గుడి చైర్మన్‌గా బహుజనులకు అవకాశం కల్పించండి

– వెంకటాద్రి యాదవ్

**రేణిగుంట, అక్టోబరు 7 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి గుడి పాలకమండలి చైర్మన్ బహుజనులకు అవకాశం కల్పించాలని బీజేపీ యువ నాయకులు యాదవ హక్కుల పోరాట కమిటీ జాతీయ కార్యదర్శి పూల వెంకటాద్రియాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన రేణిగుంటలో మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎక్కువ మంది బహుజనులు ఉన్నారన్నారు. బహుజనులకు గుడి చైర్మన్ పదవి అందని దాక్ష పండులాగా మారిందన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎన్‌డీఏ కూటమి బహుజనుల ద్వారా కంచుకోటగా మారిందన్నారు. బహుజనులపై వివక్షత చూపకుండా తప్పని సరిగా శ్రీకాళహస్తి దేవస్థానం పాలకమండలి అధ్యక్షులుగా బహుజనులను నియమించాలని డిమాండ్ చేశారు.

## బొమ్మల కొలువు



**పుత్తూరురూరల్, అక్టోబరు 7 ప్రభాతవార్త:** పుత్తూరు పట్టణంలోని శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజుల స్వామి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా ఆలయ ఆవరణలో బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కోవిల్ కార్ సాల్వాకం కిష్టప్ప మొదలి మాట్లాడుతూ ప్రత్యేక ఆనవాయితీగా దసరా ఉత్సవాల్లో ఈ బొమ్మల కొలువు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ బొమ్మల కొలువు భక్తులకు ఆకట్టుకుంటుంది.

## లలిత త్రిపుర సుందరిదేవి అలంకరణలో శ్రీ మానసాదేవి

**పుత్తూరురూరల్, అక్టోబరు 7 ప్రభాతవార్త:** పుత్తూరు పట్టణంలోని రైల్వే క్వార్టర్స్ సమీపంలో ఉన్న శ్రీ నాగాలమ్మ దేవాలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శ్రీ మానసాదేవి శ్రీ లలిత త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా ఆలయంలోని వినాయక స్వామి మానసాదేవి సుబ్రహ్మణ్యస్వామి నాగాలమ్మకు ఉదయం ప్రత్యేక అభిషేకాలు చేశారు. సాయంత్రం మహిళలు అధిక సంఖ్యలో హాజరై శ్రీ లలిత త్రిపుర సుందరిదేవికి ప్రత్యేక పూజలు కుంకుమార్చనలు మంత్ర పుష్పాలతో పూజలు చేశారు. ఉభయ దాతలుగా పుత్తూరు పట్టణానికి చెందిన ఎబ్బురు మోహన్, శ్రీదేవి(ఈఎన్‌సీ ట్రేడ్స్) దంపతులు వ్యవహరించారు. కార్యక్రమంలో నాగాలమ్మ, స్వచ్ఛంద సేవకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మికత కట్టిపడేస్తున్న కళాబృందాలు...కల్పవృక్షంలో 'కళానీరాజనం'





ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:
ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి వేంకటాద్రిపై అంగరంగవైభవంగా జరుగుతున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలలో రోజుకో అలంకారంలో స్వామివారు భక్తులనుకటాక్షిస్తుండగా భక్తులు రోజుకో వేషధారణలతో స్వామివారిని ప్రసన్నంచేసుకునేలా సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, నృత్యాలు చేస్తున్నారు. ఎటుచూసినా ఏడుకొండలు గోవిందనామస్మరణలతో మారుమోగుతున్నాయి. సోమవారం ఉదయం కల్పవృక్షవహనసేవలో పలు రాష్ట్రాల కళాకారులు కళానీరాజనం సమర్పించారు. 20 కళాబృందాలు 527మంది కళాకారులు పాల్గొని తమతమ కళాకృతులతో స్వామివారిని ఆనందపరిచారు. విశాఖపట్నం, తిరుపతి, బెంగుళూరు, తమిళనాడు,కేరళకు చెందిన కళాకారులు కోలాటలు, డ్రమ్స్,గోండునృత్యం. కాశ్మీరీనృత్యం చేశారు.

## గోవిందునికి తొమ్మిది గొడుగులు



తిరుమల,అక్టోబర్ 7ప్రభాతవార్తప్రతినిధి: తిరుమలేశుని వార్షిక బ్రహ్మోత్స వాలలో ఐదవరోజురాత్రి గరుడవాహనసేవకు వినియోగించేందుకు అవసర మైన నూతన గొడుగులు సోమవారం మధ్యాహ్నం తిరుమలకు చేరాయి. చెన్నై నుండి హిందూధర్మార్థ సమితి ట్రస్టీఆర్ఆర్ గోపాల్జీ ఆధ్వర్యంలో తిరుమలకు 9గొడుగులు చేరాయి. ఈగొడుగులకు పూజలు నిర్వహించి అనంతరం ఆలయంలోనికి చేర్చారు. ఈ కార్యక్రమంలో జీయ్యంగార్లు,టిటిడి ఈఒ శ్యామలరావు దంపతులు, అదనపు ఈఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, జెఈఒలు గౌతమి,వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈఒ లోకనాథం పాల్గొన్నారు.

## గ్యాలరీల్లో ఏర్పాట్లు బావున్నాయి

**-భక్తులతో ఆత్మీయంగా పలకరించిన ఈఓ శ్యామలరావు**



తిరుమల,అక్టోబర్ 7ప్రభాతవార్తప్రతినిధి: తిరుమలకొండపై భక్తులకు కల్పించిన ఏర్పాట్లు అద్భుతంగా ఉన్నాయని, గ్యాలరీల్లో గతంలోకంటే ఈ ఏడాది నిరంతరాయంగా అన్ని సదుపాయాలు కల్పించారని పలువురు భక్తులు తమ సంతోషం వ్యక్తం చేశారు. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలలో కల్పవృక్ష వాహనసేవలో పాల్గొని గ్యాలరీల్లో ఉంటున్న భక్తులతో నేరుగా వెళ్ళి ఈఒ శ్యామలరావు, అదనపు ఈఒ వెంకయ్యచౌదరి పలకరించి సౌకర్యాలపై ఆరా తీశారు. ఇక్కడ ఏర్పాట్లు, అలంకరణలు అద్భుతంగా భక్తిభావం ఉట్టిపడు తోందని, ఏర్పాట్లు బావున్నాయని భక్తులు అన్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో తిరుమలకు వచ్చి స్వామివారిని దర్శించుకోవడం సంతోషంగా వుందన్నారు.

## బ్రహ్మోత్సవాల్లో నేడు 08-10-2024

"మోహినీఅవతారం"



ఉదయం 7గంటలకు దేవుని వార్షిక బ్రహ్మోత్స వాల్లో అత్యంత రమ్య మైన వాహనసేవ మోహి నీ అవతారం. ఐదవ రోజు ఉదయం స్వామి వారు మోహినీ రూపం వహించి శృంగార రసాధి దేవతగా భావిస్తూ దర్శనమిస్తారు.

**గరుడవాహనం": రాత్రి 6.30గంటలకు**



బ్రహ్మోత్సవాల్లో ఐదవరోజు రాత్రి ఎంతో విశిష్టత వున్న, అత్యంత ప్రధానమైన గరుడ వాహనసేవ జరుగుతుంది. ఈ వాహనంలో సా ్వమివారు విశేష అలంకార భూషితుడై కాసుల హారం, పచ్చలహారం ధరించి భక్తులను కటాక్షిస్తాడు. గరుడసేవకు ఎంతో ప్రాధాన్యత వుంది.

## గరుడ వాహనంపై శ్రీ మూలస్థాన ఎల్లమ్మ శ్రీ నారాయణి అలంకరణలో సాక్షాత్కారం



చంద్రగిరి, అక్టోబర్ 7 ప్రభాతవార్త: శ్రీ నారాయణి అలంకరణలో శ్రీ మూలస్థాన ఎల్లమ్మ గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చి అనుగ్రహించారు.

## దుర్గమ్మకు...శివయ్య సారె



శ్రీకాళహస్తి,అక్టోబర్ 7 ప్రభాతవార్త : రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల్లో జరిగే ఉత్సవాలకు ఒక ఆలయం నుంచి మరో ఆలయానికి సారె అందించే సత్ సంప్రదాయాన్ని ప్రవేశ పెట్టారు. ఈ నేపధ్య ంలో సోమవారం తిరుపతి జిల్లా శ్రీకాళహస్తీశ్వ రాలయం నుంచి సారెను తిరుపతి ఆర్జెసి, శ్రీకాళహస్తీశ్వరాలయ ఇఓ ఎస్ ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ వారి సిబ్బందితో కలసివిజయవాడలోని కనకదుర్గమ్మకు సమర్పించారు. స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్రెడ్డి ఎక్కడ ధార్మిక కార్యక్రమాలు జరిగినా శ్రీకాళహస్తీశ్వరుని నుంచి సారె అందించాలని సూచించారు. ఈ మేరకు ఈ సంప్రదాయాన్ని అమలు చేస్తున్నారు. ఈ నేపధ్యంలో సోమవారం శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి సారెను ఆలయ ఇఓ ఎస్ ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ ఎఇఓ సతీష్మాలిక్,ఎస్ఓ నాగభూషణం యాదవ్, అర్చకులు జీవా స్వామి,అవినాష్ శర్మ,చైతన్యశర్మ,సంగమేశ్వర శాస్త్రి ఉన్నారు. శ్రీకాళహస్తి నుంచి ప్రత్యేకంగా వెళ్ళిన వారికి విజయవాడ కనకదుర్గమ్మ ఆలయం నిర్వాహకులు సాదరస్వాగతం పలికారు. సారెను అందుకున్న ఇఓ అతిధులకు అమ్మవారి దర్శనం కల్గించారు. తరువాత శ్రీకాళహస్తీ శ్వరాలయానికి సంబందించి అభివృద్ధి పనులకు సంబంధించి పాలకమండలి సభ్యులతో చర్చించారు.

## విజయవాణి వారి తెలుగు పుస్తకాలకు ప్రతిష్టాత్మక అవార్డులు

**-ఢిల్లీలో అవార్డులందుకొన్న నాయుని**




చౌడేపల్లి, అక్టోబర్ 7 ప్రభాతవార్త : ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో మంచి పేరున్న విజయవాణి ప్రింటర్స్ తెలుగు పుస్తకాలకు అవార్డుల పంట పండింది. ఢిల్లీలో జరిగిన టీచర్ చాయిస్ అవార్డుల్లో అరుదైన గౌరవం పొందింది. ఈ మేరకు విజయవాణి సంస్థల అధినేత నాయుని చంద్రశేఖర్ మూర్తి అవార్డునందుకొన్నారు. విజయవాణి ప్రింటర్స్, రూమ్టురీడ్ ఇండియా ట్రస్టు, యుఎస్ఏఐడి ఆధ్వర్యంలో జరిగిన టీచర్ చాయిస్ అవార్డుల్లో విజయవాణి ప్రింటర్స్ చే వెలువడిన 3-12 సంవత్సరాల వయస్సు మద్యగల విభాగంలో " విలువైన సాయం " మొదటి స్థానం సాధించింది. అదే విధంగా 3-8వయస్సు మద్యగల విభాగంలో " సీసాలో ఎలుక " ద్వితీయ స్థానాన్ని కైవశం చేసుకొంది. దీంతో రెండు అవార్డులను విజయవాణి ప్రింటర్స్ సాధించి తెలుగు రాష్ట్రాలకు ఆణిముత్యంలా నిలచింది. యుఎస్ఎఐడి అనేది యునైటెడ్ స్టేట్స్ ప్రభుత్వం ఆధ్వర్యంలో పనిచేసే ఒక అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ. ఈ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా వున్న అభివృద్ధి ప్రాజెక్టులు, విద్యా కార్యక్రమాలు, ఆరోగ్య పరిరక్షణ, సామాజిక అభివృద్ధి సేవలకు మద్దత్తు ఇస్తుంది. ప్రతి దేశంలో విద్యా ప్రమాణాలను మెరుగు పరచడంలో పఠనాభిరుచిని పెంపొందించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తుంది. విజయవాణి ప్రింటర్స్ పిల్లల కోసం తెలుగ భాషలో శ్రద్ధగా విద్యతో కూడిన పుస్తకాలను తయారు చేయడంలో ఉన్న వారి కృషిని ప్రతిబింబిస్తాయి. ఈ అవార్డులు చిన్నారుల్లో పఠనాభిరుచిని ప్రోత్సహించడంలోనూ, తెలుగు సాహిత్యాన్ని వికసింపచేయడంలో వారి కృషిని గౌరవించాయి.

## కత్తులతో దాడి చేసిన ముగ్గురు అరెస్టు : సిఐ



గూడూరు, అక్టోబర్ 7 ప్రభాతవార్త : గూడూరు పట్టణంలోని ఈ నెల 2వ తేది జరిగిన ఆంజనేయ స్వామి జెండా పండుగ గ్రామోత్సవంలో ఇద్దరు వ్యక్తులపై కత్తులతో దాడి చేసిన ముగ్గురిని అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టినట్లు వన్ టౌన్ సిఐ శేఖర్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గూడూరు పట్టణంలో ఈ నెల 2వ తేది జరిగిన ఆంజనేయస్వామి జెండా పండుగ గ్రామోత్సవంలో పట్టణానికి చెందిన అబ్దుల్లా రెహమాన్ అనే యువకుని పై పెద్ద మసీదు ప్రాంతంలో జెండా గ్రామోత్సవంలో డాన్స్ వేసే విషయంలో రాగిపాటి శ్రీనాథ్ అనే పట్టణానికి చెందిన మరొక యువకుడు గొడవపడ్డారు. ఈ క్రమంలో శ్రీనాథ్ కత్తితో అబ్దుల్లా రెహమాన్ పై దాడి చేసి గాయపరిచి పారిపోయాడని రెహమాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దాడికి పాల్పడిన శ్రీనాథ్ని తాళమ్మ గుడి సమీపంలో పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపారు. అదే విధంగా జెండా పండగ గ్రామోత్సవంలో చిన్న మసీదు ప్రాంతంలో పట్టణానికి చెందిన హరీష్, యశ్వంత్ అనే ఇద్దరు యువకులు పాల్గొనా పట్టణానికి చెందిన మనోజ్ అనే యువకుడు, వెంకటేశ్వర్లు అనే మైనర్ బాలుడు గొడవపడి మనోజ్, వెంకటేశ్వర్లు అనే మైనర్ బాలుడు గొడవ పడి మనోజ్, వెంకటేశ్వర్లు, హరీష్, యశ్వంతులపై దాడి చేసి గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసారని వన్ టౌన్ సిఐ శేఖర్ బాబు తెలిపారు. ఈ రెండు కేసుల్లో ముద్దాయిలను పోలీసులు అదుపులో తీసుకొని కోర్టులో ప్రవేశపెట్టడం జరిగిందని తెలిపారు.

## తీర ప్రాంత నాయకులు వైసిపికి రాజీనామా



వాకాడు, అక్టోబర్ 7 ప్రభాతవార్త: వాకాడు మండలం తీర ప్రాంత పంచాయితీల సర్పంచులు, నాయకులు సోమవారం మూకుమడిగా వైసిపి పార్టీకి రాజీనామా చేశారు. రావిగుంట పాలెం గ్రామంలో మాజీ వ్యవసాయ సలహా మండల అధ్యక్షులు, వైసిపి సీనియర్ నాయకులు దువ్వూరు అజిత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిడిగుర్తి సర్పంచ్ మల్లాపు నాగరాజు, రావిగొండపాలెం సర్పంచ్, ఎంపిటిసిలు, పూడిరాయి దొరువు, మూల పడవ పంచాయితీలోని తీర ప్రాంత వైసిపి నాయకులు అజిత్ కుమార్ రెడ్డి నివాసంలో మూకుమడిగా వైసిపికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా అజిత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వైసిపి పార్టీకి మూకుమడిగా రాజీనామా చేయడం జరిగిందని త్వరలో ఏ పార్టీలో చేరపోతున్నామన్న విషయమై ప్రకటిస్తామని తెలిపారు. నా మీద నమ్మకంతో సర్పంచులు, ఎంపిటిసిలు, సీనియర్ నాయకులు రాజీనామా చేశారని పేరుపేరునా ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను అన్నారు.

## అరుదైన నక్షత్ర తాబేలును ఫారెస్టు అధికారులకు అప్పగింత



గూడూరు, అక్టోబర్ 7 ప్రభాతవార్త : గూడూరు పట్టణంలో అరుదైన నక్షత్ర తాబేలును జనసేన నాయకులు రక్షించారు. గత రాత్రి చిల్లకూరు నుండి గూడూరు పట్టణానికి ద్విచక్ర వాహనం పై వస్తుండగా బాబా గుడి సమీపంలో ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలతో ప్రమాదం అంచున వున్న అరుదైన నక్షత్ర తాబేలును గుర్తించిన జనసేన నాయకులు కాపాడారు. ఈ నేపథ్యంలో అటవీ శాఖ అధికారులు హరిక, చిన్న, రమణయ్యకు సమాచారం ఇచ్చి గూడూరు జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ రావు అటవీ శాఖ అధికారులకు నక్షత్ర తాబేలును అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్యప్రాణుల సంరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని అరుదుగా కనిపించే నక్షత్ర తాబేలును అలాగే ఇతర వన్యప్రానులు జనావాసాల్లోకి వచ్చిన సమయాల్లో వాటిని సంరక్షించి సంబంధిత అధికారులకు అప్పగించాలని కోరారు. అనంతరం పారెస్ట్ అధికారి రవీంద్రనాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 70వ వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాలు జరుగుతున్న సమయంలో గూడూరులోని ప్రధాన రహదారిపై నక్షత్ర తాబేలును గుర్తించి ప్రమాదం నుండి కాపాడి అప్పగించిన జనసేన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది కృష్ణయ్య, జనసేన నాయకులు మోహన్, మనోజ్, క్రాంతి, నాగార్జున, భాస్కర్, సాయి కిరణ్, తిరుపాలు పాల్గొన్నారు.

## వామన అవతారంలో దర్శనమిచ్చన వెంకటేశ్వర స్వామి



వెంకటగిరి, అక్టోబర్ 7 ప్రభాతవార్త : శ్రీహర హర క్షేత్రంలో వెలసి వున్న శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి వామ అవతార అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సంతాన కామాక్షి దేవి అలంకారణంలో భక్తులకు కాత్యాయని అమ్మవారు దర్శనమిచ్చారు.

## మహాలక్ష్మి దేవి అలంకారంలో ముత్యాలమ్మ

చిల్లకూరు, అక్టోబర్ 7 ప్రభాతవార్త : మండల పరిధిలోని తూర్పు గ్రామంలో వెలసిన శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా 5వ రోజు శుక్రవారం ఉదయం మూలమూర్తులకు అభిషేకం, గణపతి పూజ, చండీ పారాయణం చండీ హోమం నిర్వహించారు. ఉదయం మూలమూర్తిని బంగారు కాసులు అలంకారంలో అలంకరించడం జరిగింది. సాయంత్రం సహస్రనామార్చన మూలమూర్తి నిజపాద దర్శనం నిర్వహించారు. అనంతరం ముత్యాలమ్మ అమ్మవారు మహాలక్ష్మి దేవి అలంకారంలో గజా వాహనంలో అర్ధరథంపై కొలువుదిరి భక్తులకు దర్శినమిచ్చారు. అనంతరం మాడా వీధుల్లో ఘనంగా మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నలుమూలల నుండి భక్తుల గ్రామ నలుమూలల నుండి అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాలకు సుబ్రమణ్యం రెడ్డి వ్యవహరించారు. అదే విధంగా కలవకుండా గ్రామంలో కొండపై వెలసి ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో 5వ రోజు ఆలయంలో సామూహికంగా కుంకుమార్చన కార్యక్రమం అనంతరం సాయంత్రం గజలక్ష్మి అమ్మవారి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శినమిచ్చారు. ఈ కార్యక్రమాలకు వ్యవహరించారు. ఈ కార్యక్రమాలను ఆలయ చైర్మన్ సిద్ధరెడ్డి ఇంద్రసేనారెడ్డి ఈవో కొమ్మలపూడి నవీన్ కుమార్, కమిటీ సభ్యులు చంద్రారెడ్డి దువ్వూరు సాయి కృష్ణారెడ్డి చేవూరు శ్రీనివాసులు బాలు బాలాజీ ఉప్పల ప్రభాకర్ ఎల్లసిరి పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

## గాయత్రిదేవిగా దర్శనమిచ్చిన మరగదాంబిక అమ్మవారు

కాణిపాకం, అక్టోబర్ 7 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ మరగదాంబిక సమేత శ్రీ మణికంఠేశ్వరాలయంలో జరుగుతున్న దసరా శవన్నరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు మరగదాంబిక అమ్మవారు గాయత్రి దేవి అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్ ఆధ్వర్యంలో అమ్మవారి మూలవిరాట్కు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి అలంకరించి పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే సాయంత్రం గాయత్రిదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

## కొత్తపట్నంలో గ్రామసభ



కోట, అక్టోబర్ 7 ప్రభాతవార్త : కోట మండలం కొత్తపట్నం పంచాయతీలో సోమవారం సర్పంచ్ తిరుపాలయ్య ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభకు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి భూములిచ్చిన రైతులందరికీ పరిహారం ఇప్పిస్తామని చెప్పారు. పలువురు రైతులు మాట్లాడుతూ రికార్డుల ప్రకారం రైతులకు చట్టబద్ధత కల్పించి ఉంటే ఆక్రమణలు అనేవి ఉండేది కాదన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే రైతుల భూములు ఆన్లైన్లో నమోదు కాలేదని పలువురు రైతులు చెప్పారు. ఆక్రమణదారులకు రూ.10 లక్షలు ఇవ్వాలని సూచించారు. దీనిపై సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని చెప్పారు. తొలిసారిగా సబ్ కలెక్టర్ గ్రామసభకు విచ్చేసినందు వల్ల ఆయన పట్ల ఉన్న గౌరవంతోనే ఈ సభ ప్రశాంతంగా జరిగేందుకు తాము సహకరించామని మాజీ జడ్పిటిసి సభ్యులు ప్రసాద్గౌడ్, సర్పంచ్ తిరుపాలయ్య చెప్పారు. తమకు తగిన పరిహారం ఇవ్వకపోతే భూములిచ్చే ప్రసక్తే లేదని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కె.జయజయరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అర్ధనారీశ్వరీ సర్వేశీ పార్వతీదేవి నమోస్తుతే...!



బోయకొండ(చౌడేపల్లి), అక్టోబర్ 7 ప్రభాతవార్త : ప్రముఖ శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో దసరా శరవన్నరాత్రి ఉత్సవాల్లో భాగంగా 4వ రోజైన గురువారం అమ్మలనుగన్న గంగమ్మ పార్వతీదేవి అలంకారంలో భక్తులను అలరించింది. ఉదయాన్నే అమ్మవారికి అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేకాభిషేకం, పార్వతీదేవి అలంకరణగావించారు. ఉభయదారులచే హోమంలో పూర్ణాహుతి గావించారు. చౌడేపల్లి శివకుమార్, శ్రీదేవి, రాధాకృష్ణ, శిరీషా, బెంగళూరు సంజీవరెడ్డి, విమలమ్మ, చిక్కె మునిశెట్టి, వెంకటమ్మ, సోమల రెడ్డెప్ప, సుజాత, దేవనల్లి గురుప్రసాద్, గుణనేత్ర, తిరుపతి అంజప్ప, రాధిక, బెంగళూరు నారాయణస్వామి, కోమల, చెన్నై సురేష్, సుగితలు ఉభయదారులుగా వ్యవహరించారు. వారికి ఆలయ ఇవో, ఉపకమీషనర్ ఏకాంబరం అమ్మవారి పవిత్ర తీర్థ ప్రసాదాలు, చిత్రపటాలతో సత్కరించారు. అర్చక, అధికార, సిబ్బంది పాల్గొన్నారు.

## మహా చండి అలంకరణలో అమ్మవార్లు

సదుం, అక్టోబరు 7 ప్రభాతవార్త: మండల పరిదిలో జరుగుతున్న దసరా ఉత్సవాలలో భాగంగా సోమవారం పలు అమ్మవారి ఆలయాలలో అమ్మవార్లకు మహచండి అలకంరణలో పూజలు నిర్వహించారు. సదుంలోని శ్రీసదుమమ్మకు, పచ్చారుమాకులపల్లె గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ గంగపురమ్మకు, జాండ్రపేటలోని శ్రీచౌడేశ్వరీదేవి అమ్మవారికి శ్రీమహాచండిదేవి అలంకరణ చేశారు. ఉదయం అభిషేకాలు చేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో మహిళల చేత కుంకుమాభిషేకాలు జరిపించారు. అదేవిధంగా సదుమమ్మకు రాత్రి ఉయ్యాల సేవ నిర్వహించారు. అనంతరం ఆలయం చుట్టు ప్రదక్షణ చేయించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అదే విధంగా తితిదే ఆధ్వర్యంలో బూరగమందలోని శ్రీవెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. మాజీ సర్పంచి వెంకటరెడ్డి, ప్రభాకరరెడ్డి,తితిదే సిబ్బంది,గ్రామస్థులు జక్కల రవి,సుబ్రమణ్యం పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే గురజాల ఆధ్వర్యంలో సహస్ర చండీ యాగం



చిత్తూరు, అక్టోబర్ 7 ప్రభాతవార్త: చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్నాయుడు ఆధ్వర్యంలో సంతపేట జిజెఎం సుఖీభవ కన్వెన్షన్ హాలులో తొమ్మిది రోజుల పాటు తలపెట్టిన నవ చండీ యాగంలో భాగంగా సోమవారం శ్రీశ్రీశ్రీ డాక్టర్ బాలకృష్ణ గురూజీ ఆయన శిష్యగణంచే సహస్ర చండీ యాగం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో నియోజకవర్గ ప్రముఖులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

**ఎమ్మెల్యే గురజాలను కలిసిన శాప్ ఛైర్మన్**

ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్నాయుడును సోమవారం స్పోర్ట్స్ ఆథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(శాప్) ఛైర్మన్ అనిమిని రవినాయుడు కలిశారు. విజయవాడలో శాప్ ఛైర్మన్గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం రవినాయుడు చిత్తూరు చేరుకొని సంతపేట జిజెఎం సుఖీభవ కన్వెన్షన్ హాలులో సహస్ర చండీ యాగంలో వున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్నాయుడును కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్నాయుడు శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడును సన్మానించారు. అనంతరం శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు చండీ మాతను దర్శించుకుని యాగం నిర్వహిస్తున్న శ్రీశ్రీశ్రీ డాక్టర్ బాలకృష్ణ గురూజీ ఆశీర్వాదం తీసుకున్నారు.

## మొక్కజొన్నల అలంకరణలో ముత్యాలమ్మ అమ్మవారు



శ్రీకాళహస్తి, అక్టోబర్ 7 ప్రభాతవార్త : శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీకాళహస్తి పట్టణంలోని శక్తి ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఈనేపధ్యంలో మొక్క జొన్నల అలంకరణలో ముత్యాలమ్మ అమ్మవారు భక్తులకు కనువిందు చేశారు. ఈసందర్భంగా అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మొక్కజొన్నలతో చేసిన అలంకరణ భక్తులను ఇట్టే ఆకట్టుకుంటోంది.

## కల్పవృక్ష వాహనంపై శ్రీ రాజమన్నార్ అవతారం



తిరుపతిరూరల్, అక్టోబర్ 7 ప్రభాతవార్త: తుమ్మలగుంట శ్రీకళ్యాణ వేంకటేశ్వర స్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా నాలుగోరోజున సోమవారం ఉదయం స్వామి శ్రీరాజమన్నార్ అవతారంలో ఉభయ దేవేరులతో కలిసి కల్పవృక్ష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. మంగళ వాయద్యాలు, చెక్క భజనలు, కోలాటాలు, దేవతా మూర్తుల కళారుపాల నడుమ గ్రామ వీధుల్లో వాహన సేవ కోలాహలంగా సాగింది. అనంతరం స్వామి అమ్మవార్లకు వేడుకగా స్నపనతిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు, కొబ్బరి నీళ్ళుతో అభిశేకం చేసారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు చెవిరెడ్డి భాస్కర్రెడ్డి, పేరూరు సర్పంచ్ దామినేటి కేశవులు, ఎంపిటిసి మూలం చంద్రమోహన్రెడ్డి, జానకిరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చిరుద్యోగులపై కూటమి ప్రతాపాలా?



తొట్టంబేడు, అక్టోబర్ 7 ప్రభాతవార్త :ప్రజల్ని వంచించే చిరుద్యోగులను వేధించే ప్రభుత్వం మంచి ప్రభుత్వం ఎలా అవుతుందని సిఐటియు నాయకు లు ప్రశ్నించారు. ఇది ముమ్మాటికీ మాయదారి ప్రభుత్వమని స్పష్టం చేశారు. తీరు మారకుంటే వైసిపికి పట్టిన గతే తెలుగుదేశంపార్టీకి పడుతుందని హెచ్చరించారు. చిరుద్యోగులపై రాజకీయ వేధింపు లకు వ్యతిరేఖంగా తొట్టంబేడు వెలుగు కార్యాలయం వద్ద బాధిత సంఘమిత్రలు, వారిక మద్దతుగా వచ్చిన గ్రామస్తులతో కలసి సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరిపుల్లయ్య, జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య సంయుక్తంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను, సూపర్సిక్స్ పథకాలను విస్మరించిందన్నారు. ఉద్యోగ, ఉపాధి కల్పనలో వెనుకబడిందని కూటమిలోని రాజకీయ నిరుద్యోగులకు లబ్ధి చేకూర్చేందుకు అధికారంలోకి వచ్చిన రోజు నుంచి స్కీం వర్కర్లే లక్ష్యంగా రాజకీయ వేధింపులు మొదలు పెట్టిందని అగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులను వేధించే ఏప్రభుత్వానికి కూడా పుట్టగతులుండవని హెచ్చరించారు. గత ఎన్నికల్లో వైసిపికి అనుకూలంగా పనిచేశారన్న నెపంతో దళిత సంఘ మిత్రలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, అంగన్వాడీలు, వర్కర్లు, ఆశా వర్కర్లును, పాఠశాలలో పనిచేస్తున్న వర్కర్లను పెద్ద ఎత్తున రాజకీయ కుట్రతో తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబాలను రోడ్డుపైకి నెట్టివేసిన నాయకులకు పుట్టగతులు ఉండవన్నారు. కార్యక్రమంలో నాయకులు గంధం మణి, వేణు, రాజ, చందన్కుమార్, సంఘమిత్రలు సరస్వతీ, రేవతి, భూలక్ష్మి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్లో ఉన్న పన్నులు వసూలు చేయండి

**-అధికారులను ఆదేశించిన కమిషనర్ ఎన్. మౌర్య**



తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 7 ప్రభాతవార్త : తిరుపతి నగరంలో పెండింగ్లో ఉన్న అన్ని రకాల పన్నులు వసూలు చేసి నగర అభివృద్ధికి పై దృష్టి సారించాలని కమిషనర్ ఎన్. మౌర్య అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, పన్నులు వసూళ్లు, పారిశుద్ధ్యం, నీటి సరఫరా తదితర అంశాలపై నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం వివిధ విభాగాల అధికారులతో కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి రోజు చెత్త సేకరణకు వాహనాలు వెళ్లాలని, ఇంటి వద్దనే తడి, పొడి చెత్త వేరు చేసి తీసుకోవాలని అన్నారు. హోటల్స్ ఎక్కువ జనసంచారం ఉన్న ప్రాంతాల్లో రాత్రి స్విపింగ్ చేసేలా చర్యలు చేపట్టాలని అన్నారు. పెండింగ్లో ప్రకటన బోర్డుల పన్నులు వసూలు చేయాలన్నారు. టిడిఆర్ బాండ్లు వివరాలు సిద్ధం చేయాలని అన్నారు. శెట్టిపల్లి భూముల వివరాలు, లబ్ధిదారులు వివరాలు సిద్ధం చేయాలని అన్నారు. అనధికారిక లేఔట్స్, బిల్డింగ్ నిర్మాణాలకు అనుమతులు ఇవ్వరాదని అన్నారు. నగరంలో ఆక్రమణకు గురికాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులపై దృష్టిసారించాలన్నారు. నగర అభివృద్ధికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, డిఈలు రాజు, మహేష్, లలిత, వెంకట ప్రసాద్, మోహన్, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్ రెడ్డి, రెవెన్యూ ఆఫీసర్స్ సేతు మాధవ్, రవి, మేనేజర్ హసీమ్, ఏసిపిలు బాలాజీ, రమణ, వెటర్నరీ ఆఫీసర్, నాగేంద్ర, శానిటరీ సూపర్వైజర్లు చెంచయ్య, సుమతి, ఆర్ఐలు, మేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

## గాయత్రి దేవిగా ఆరిమాను గంగమ్మ

శ్రీరంగరాజపురం, అక్టోబర్ 7 ప్రభాతవార్త: శ్రీరంగరాజపురం ఆరిమాకులపల్లి గ్రామంలోని ఆరిమాని గంగమ్మ సోమవారం గాయత్రి దేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. ఆరిమాకులపల్లి ఆరిమాని గంగమ్మ దేవాలయంలో గత ఐదు రోజులుగా దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయంలో అమ్మ వారికి నిర్వహించిన అభిషేకం కార్యక్రమంలో ఉభయదారులుగా రుతిత, మురళీ, అరుణ, విజయబాబురెడ్డి, లత, రామ్మూర్తిరెడ్డి కుటుంబసభ్యులు వ్యహరించారు. ఆలయ అర్చకులు వెంకటాచలపతి, అప్పిస్వామి బృందం ప్రాతఃకాలార్చన, హారతి, హోమం, అభిషేకం, మహా మంగళహారతి ఇచ్చి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మధ్యాహ్నం బుజ్జిరత్నం, శోభ వజ్రం, రాధిక, గజేంద్ర, వనజ, శంకరయ్యల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారు గాయత్రిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు హిమాచలపతిరెడ్డి, జలంధర్నాయుడు, వెంకటరమణ, సిద్ధయ్యశెట్టి, మునిరెడ్డి, హేమాద్రియాదవ్, స్థానికులు జగన్నాథనాయుడు, సుబ్రమణ్యంనాయుడు, చందు, దేవాలయ సిబ్బంది, తయ్యూరు కట్టు 18 గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## సంఘమిత్ర మాకు వద్దు..స్వయం సహాయక మహిళలు ధర్నా



గంగవరం, అక్టోబర్ 7 ప్రభాతవార్త : ఈ సంఘమిత్ర మాకు వద్దంటూ స్వయం సహాయక సంఘాల మహిళలు మంగళవారం స్థానిక స్త్రీ శక్తి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళల కథనం మేరకు వివరాలిలా..మండలంలోని కీలపట్ల పంచాయతీ బండమీద జరవారిపల్లె గ్రామానికి చెందిన హేమలత అనే మహిళను కీలపట్ల మహిళా సమైక్య 3వ సంఘమిత్రగా కొందరు గ్రూపు మహిళ సభ్యుల ఆధ్వర్యంలో అధికారులు ఇటీవల నియమించారు. ఈ నేపధ్యంలో ఇదే గ్రామానికి చెందిన శ్రీనివాసులు అనే వ్యక్తి సంఘమిత్రగా గతంలో పనిచేస్తుండేవాడు. అయితే గతంలో సంఘమిత్రగా పనిచేస్తున్న శ్రీనివాసులను వెలుగు అధికారులు అకారణంగా తొలగించారని,గ్రూపు మహిళా సభ్యుల తీర్మానం లేకుండా,నిబంధనలకు విరుద్దంగా ప్రస్తుత సంఘమిత్ర హేమలతను ఎలా నియమిస్తారని అధికారులను మహిళలు ప్రశ్నించారు. కార్యాలయం ముందు 100 మంది మహిళలు ఈ సంఘమిత్ర మాకొద్దు..పాత సంఘమిత్రనే కావాలంటూ..డ్వామా పిడి రావాలి మాకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. గ్రూపు సభ్యుల ఆమోదం లేకుండా నిబంధనలకు విరుద్దంగా నియమించిన సంఘమిత్రను వెంటనే తొలగించి శ్రీనివాసులునే సంఘమిత్రగా కొనసాగించాలని మహిళలు కోరారు. నిబంధనలకు విరుద్దంగా సంఘమిత్రను నియమించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రూపు మహిళలు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఏపిఎం హరినాథ్ మంగళవారం ఏపీడి రవికుమార్ మీ గ్రామానికి గ్రామ సభ ఏర్పాటు చేసి మహిళా సభ్యుల అభిప్రాయం మేరకు నిర్ణయిస్తూ మీకు న్యాయం చేస్తామని చెప్పడంతో మహిళలు ధర్నా విరమించారు.